# మిసిమి

మాస పత్రిక

జనవరి - 1998

వెల - రూ॥ 6/-



# ముఖచిత్రం



**వాన్‌డిక్ 1599-1641**

**వాన్‌డిక్** అంతర్జాతీయ కళాకాశంలో ఒక వెలుగు వెలిగాడు. ఇటలీ ఇంగ్లాడ్‌లలో కులీన శైలి అన దగిన చిత్రలేఖనాన్ని ప్రమాణీకరించారు. యూరోప్ అంతట కళాకారులు తనను అనుకరించేట్టు చేశాడు.

అంతోని వాన్‌డిక్ 22 మార్చి 1959లో ఫ్రాన్స్ వాన్‌డిక్‌కు అతని ద్వితీయ కళత్రం మరియు కుపర్స్‌కు సప్తమ సంతానంగా జన్మించాడు. విలాస జీవితాన్ని గడిపాడు. చిత్రలేఖనంలో జమిందారీ పోకడలను ప్రవేశ పెట్టాడు అతడు పదవయేటనే మనిషిబొమ్మలను వేయడంలో కీర్తిగడించాడు. అతడు 1615 లో తన స్వంత స్టూడియోను యాంట్వెర్ప్‌లో ఏర్పరుచుకొన్నాడు ఇలా ఏర్పరుచుకోవడంలో అతడు కళాకారుల నియమావళిని ఉల్లంఘించాడు. ఏ కళాకారుడు 'మాస్టరు' పట్టాపుచ్చుకోకుండ, తన చిత్రాలను అమ్మజూపరాదు.

ఆరోజుల్లో యాంట్వెర్ప్‌లో కళారంగాన్ని రూబెన్స్ ఏలాడు. ఇతని సృజనాత్మక శక్తి, పైకి ఎదగాలను కొన్న వాన్‌డిక్‌కు అవరోధమైంది. దీనిని అధిగమించాలని డిక్‌కంకణం కట్టుకొన్నాడు. అలాగే రూబెన్స్ కళారీతిని అలవోకగా తనదిగా చేసుకొని, అతనిని మించి పోయాడు. చిత్రకళా చరిత్రలోనే వాన్‌డిక్ అత్యంత విజయవంతమైన కళాకారుడు. చార్లెస్ ఆస్థానానికి సంబంధించిన అతని మిరుమిట్లుగొలిపే చిత్రాలు అకాలంలో ఎంతో ప్రభావకాలై, తరువాతి 200సంవత్సరాల వరకు ఆంగ్ల కళా రీతులను. శాసించాయి. ఇతడు రూబెన్స్ తో ప్రభామిత్రుడైనా, తన మౌలిక సృజనాత్మకతను వీడలేదు. 1627 లో ఇటలీ నుంచియాంట్వెర్ప్‌కు తిరిగిరాగానే. ఇజబెలా జమిందారిణికి ఆస్థాన చిత్రకారుడుగా నియమితుడయ్యాడు. 1632లో వాన్‌డిక్‌ను చార్లెస్ I ఇంగ్లాడుకు రావించి ఆస్థాన చిత్రకారుని చేశాడు. కాని జీవితంలో చారిత్రక కళాకారుడు (History Painter) కావాలను కొన్న అతని ఆస అడియాసే అయింది.

## చిత్రం : ఓ అనుభూతిక ప్రతిమ

వాన్‌డిక్ తన అందాలకు తానే మురిసి పోయేవాడు. గర్వపడేవాడు. అందుకనే తననే తాను అనేక చిత్రాలలో చిత్రించుకున్నాడు. ఈ చిత్రంలో అతని వయస్సు 25. మంచి కోడెకారు వయస్సు. (గ్రీకు పురాణం ప్రకారం ట్రోజన్ యుద్ధానికి కారణం దివ్యాంగనల అందాల పోటీ. ఈ పోటీలో గొర్రెల కాపరి పారిస్, వీనస్‌ను అందాల భామగా ఎంచి, ఆమెకు బంగారు ఆపిల్ పండును బహూకరించాడు. వాన్‌డిక్, ఈ చిత్రంలో తనను గొర్రెల కాపరి పారిస్‌గా చిత్రించుకొన్నాడు.

# మిసిమి

"All that we are is the product of what we have thought" is "We are what we think." — Dammapada.

సంపుటి 10 | జనవరి 1998 | సంచిక 1

వ్యవస్థాపక సంపాదకుడు : డాక్టర్ రవీంద్రనాథ్ ఆలపాటి

## విషయసూచిక


లాటిన్ అమెరికా నిస్సహాయ ఏకాంతవాసం - జి. బుచ్చయ్య చౌదరి

ఎరిక్‌ఫ్రామ్ సిద్ధాంతం - అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి

నవ్వు నాలుగందాల గ్రేట్ కె. సింగయ్య

శ్రీనాథుఁడు – అతని మనస్తత్త్వము -పుట్టపర్తి నారాయణాచార్యులు

కవిత్వంలో అనిర్వచనీయత -బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు - చిరుమామిళ్ల సుబ్బారావు

మనిషిని కాపాడుకుందాం - డా. దేవరాజు మహారాజు

ప్రజావిదూషకుడి క్రోధం - యస్. ఎ. మహమ్మద్



విడిప్రతి రూ. 6/- వార్షిక చందా రూ. 70/-

ముఖచిత్రం : ఓ అనుభూతిక ప్రతిమ

Printed & Published by BAPANNA ALAPATI at Kala Jyothi Process Ltd.,
1-1-60/5, R.T.C. X Roads, Musheerabad, Hyd-20. Ph. 7645536

సంపాదకుడు : అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి

# THE HISTORIC TASK OF POLITICS IN INDIA

**- Dr. K. B. KRISHNA**

Politics has one task that is to create. It must create not in abstraction but in synthesis. To bring the society towards socially imperative progressive forces is to be creative. Politics must take Lindbergh flights into unchartered seas. It must ever be in quest of an endeavour for heroic action. It cannot grow on the cast off notions. of the West. It must trace the historic roots of Brahmanism. It must study the material circumstances that led to the institution of caste. With the insight of Max Weber, and the artistic creation of Werner Sombart, it must illumine the class basis of Hindu culture, it must unearth the social struggle that the caste system epitomized. It must strip Buddha of his metaphysics as Marx did of Hegel. It must present the tremendous import of social revolution that Buddha conveyed in his gospel. It must dissect the path ology of a money lender, the bases of ceremonials that make a Brahmin a social parasite, a peasant indebted, a lawyer suave and subtle, and Gandhi medieaval and pacific. It must enquire into the origins of temples and the role they played in the accumulation of private property. Such is the historic task of politics in India.

---

*-The Separation of Judicial and Executive Functions with Reference to the India Magistracy. Submitted to Professor Felix Frankfurter, Harvard University, June 14, 1932.*

# లాటిన్ అమెరికా నిస్సహాయ ఏకాంతవాసం

## *నోబెల్ స్వీకృతీ ప్రసంగం : డిసెంబర్ 8, 1982*

గేబ్రియల్ గార్స్య మార్క్వెజ్ — జి. బుచ్చయ్య చౌదరి

ఫ్లొరెన్స్ నావికుడు ఏంటోనియో పిగఫెటా, మాజిలాన్ నాయకత్వం వహించిన తొలి ప్రపంచ యాత్రలో పాల్గొన్న బృందంలో ఒకడు. దక్షిణమెరికా భూభాగాలలో నుంచి యాత్ర ముగించిన తరువాత దానిమీద అతను ఓ పుస్తకం రాశాడు. పిఱుదుల మధ్య నాభి వున్న వరాహాలూ, తమ జతమగపిట్టలపై గుడ్లుపెట్టే కాలిగోళ్లు లేని ఆడపిట్టలూ, నాలుకలు లేని, గరిటెలాంటి ముక్కులతో పెలికన్ పక్షులను తలపించే పక్షులూ - ఇలాంటి విశేషాలతో ఆ యాత్రావిశేషాల గ్రంథం చదువరులకు అదో అభూత కల్పనేమో అని అనిపించేలా వుంది. ఆ పుస్తకంలోనే కంచరగాడిద తలా, చెవులతో, ఒంటె శరీరంతో, జింకకాళ్లతో, గుఱ్ఱం సకిలింపుతో వున్న ఒక జంతువు ప్రస్తావన గూడా వుంది. పాటగోనియ (దక్షిణమెరికాలోని ఏండిజ్ పర్వత పంక్తులకు తూర్పుగావున్న అర్జెంటీనా, చిలీల దక్షిణభాగాలు) లోని భీకరాకారుడైన ఓ ఆదిమవాసి అద్దంలో తొలిసారిగా తననుతానే చూసుకుని భయంతో మనసు వశంతప్పి ఎలా గడగడ వణికిపోయాడో ఈ పుస్తకంలో వుంది.

ఆ కాలపు ఈ వర్ణనలు ఇప్పటి మన నవలలకు మాతృకలేమో అని అనిపిస్తాయే తప్ప మన కాలపు ఘోర వాస్తవాల కేమాత్రం సరితూగవు. ఇండిజ్ (ఇక్కడ వెస్టిండిజ్) చరిత్రకారులు పుంఖానుపుంఖంగా ఇలాంటి విషయాలే రాశారు. ఎన్నో సంవత్సరాలుగా మన భావనలకు అందకుండా, మనం ఎంతో ఆసక్తిగా వెదకే ఎల్ డొరాడో ఒక్కొక్క చిత్రపటకారుడి మనోకల్పన ననుసరించి ప్రపంచపటంలో ఒక్కోచోటికి మారుతూ వచ్చింది. సతతయౌవన ప్రదాయినియైన ఓ జలధార మెక్సికోలో వుందని భ్రమించి ఆరొందలమంది అనుయాయులతో చేసిన ఎనిమిది సంవత్సరాల బృహద్యత్నం తమను తామే పీక్కుని తినడం వలన ఐదుగురు మాత్రమే ప్రాణాలతో మిగిలి ఘోరంగా విఫలమైంది. అతహువల్పాకు కప్పంగట్టటానికి ఒక్కొకదానికి వంద పౌండ్ల బంగారంతో కజ్కో నుంచి బయలుదేరిన పదకొండు వేల మోతగాడిదలు గమ్యానికి చేరకుండా ఏమయాయనేది ఆనాటి లోతే ఎరుగని నిగూఢ రహస్యం. కార్టజీనాడ ఇండియజ్ అనే సముద్రరేవు పట్టణంలో బంగారు రేణువులున్న ఒండ్రులో మేసిన బాతుల కడుపుల్లోని బంగారం కోసం వ్యాపారం ఉధృతంగా సాగింది. మన వ్యవస్థాపకుల స్వర్ణవ్యామోహం మనను గూడ లోగొన్నది. దీని కుదాహరణగా పోయిన శతాబ్దంలో పనామా జలసంధి కడ్డంగా రైలుమార్గం నిర్మించడం కోసం ఏర్పరచబడ్డ జర్మన్ బృందం అక్కడి ఇనుము కొరత వలన రైలుమార్గాన్ని బంగారు పట్టాలతో వేస్తేనే తప్ప అసాధ్యమని తేల్చిచెప్పింది.

స్పెయిన్ అధిపత్యం నుంచి విముక్తమైన తరవాత కూడా ఇలాంటి ఉన్మాదం నుండి మనం ఇంకా దూరం కాలేదు. మూడు సార్లు నియంతగా మెక్సికోను పాలించిన జెనరల్ ఏంటోనియో లోపెజ్ డ శాంటానా పేస్ట్రీయుద్ధ మని పిలవబడే యుద్ధంలో తెగిపోయిన తన కాలుకు వైభవోపేతమైన అంత్యక్రియలు నిర్వహించుకున్నాడు. ఈక్వడార్‌ను పదహారేళ్లపాటు తిరుగులేని చక్రవర్తిగా ఏలిన జెనరల్ గేబ్రియల్ గార్స్య మొరీనో శవాన్ని పూర్తి సైనిక దుస్తులలో, రక్షాపతకాలతో

అలంకరించి అధ్యక్ష సింహాసనంలో కూర్చునబెట్టి ఊరేగించారు. మతాధికారి స్థానం నుంచి నియంతగా పరిణామమంజెంది, ముప్ఫైవేల.మంది వ్యవసాయ కార్మికులను క్రూరాతి క్రూరంగా వధించిన జెనరల్ మాక్సిమిలానో హర్నాన్డెజ్ మార్టినెజ్ తన భోజనంలో విషప్రయోగమేమైనా చేసివుంటే కనుక్కునే వీలున్న లోలకాన్ని(?) రూపొందించాడు. స్కార్లెట్ విషజ్వరాన్ని నిర్వీర్యంచేయాలనే సంకల్పంతో వీధి దీపాలకు ఎఱ్ఱకాగితాన్ని చుట్టించాడు. టెగ్యుసిగాల్ప నగర ప్రధాన కూడలిలో ప్రతిష్ఠించిన జెనరల్ ఫ్రాన్సిస్కో మొరజేన్ విగ్రహం వాస్తవానికి పారిస్‌లో వున్న అమ్మకానికి తీసివేసి ప్రక్కకు బెట్టిన విగ్రహాల నుంచే గోదాం నుంచి ఎన్నుకుని కొనుగోలుచేసిన మార్షల్ నీ అనే ఆయనది!

మన కాలపు కవిప్రముఖులో గణుతికెక్కిన చిలీ కవి పాబ్లో నెరూడా పదకొండు సంవత్సరాల క్రితం తన కవితతో ప్రపంచ శ్రోతల్ని జాగృతం చేశాడు. అప్పటినుంచి పూనకమెత్తిన పురుషులతో, మానసిక దౌర్బల్యంతో ఉన్మాదులైన స్త్రీలతో నిండి పేరుమోసిన అమిత విశాలమైన లాటిన్ అమెరికాను గురించి వచ్చే అసహజమైన వార్తా పుంఖాలు దానిపట్ల మైత్రీభావం వున్న ఆ భావంలేని యూరప్ వాసులకు నిరంతరం సుపరిచితంగా వస్తూనే వున్నాయి. మాకు ఒక్క క్షణమైనా విశ్రాంతి లేదు. ఈ ప్రాంతానికి వూపిరులూదాలని సంకల్పించిన మేధావీ, సజ్జన శీలి ఐన ఒక దేశాధ్యక్షుడు తన సమస్త సైన్యంతో ఒంటరిగా పోరాడుతూ తన భవనంలో అగ్నికీలలు చుట్టుముట్టగా ఆహుతయ్యాడు. మంచి మనసున్న మా మరో దేశాధ్యక్షుణీ, మా వాళ్ల ఆత్మగౌరవాన్ని తిరిగి మా కందించిన ఓ ప్రజాస్వామ్య యోధుణ్ణి వివరణ కందని, అనుమానాస్పదమైన రెండు వేర్వేరు విమాన ప్రమాదాలు బలితీసుకున్నాయి. ఐదు యుద్ధాలూ, ఎనిమిది సైనిక తిరుగుబాట్లూ జరిగాయి. ఒక రాక్షస నియంత ఆవిర్భవించి, భగవంతుడి పేరుమీద లాటిన్ అమెరికాలోనే మొట్టమొదటిసారిగా జాతివిధ్వంసకాండను నిర్వహిస్తూ వస్తున్నాడు. ఈ మధ్యకాలంలో, యూరప్‌లో 1970 నుంచి ఇప్పటిదాకా పుట్టినవాళ్లందరి కన్నా ఎక్కువగా లాటిన్ అమెరికాలోని ఏడాది దాటని రెండుకోట్ల పసిపిల్లలు మృత్యువాతను పడ్డారు. అణచివేత వలన జాడతెలియని వారి సంఖ్య లక్షా ఇరవై వేల దాకా వుంటే, అందులో అప్పుల లోని కనిపించకుండా పోయిన మొత్తం పౌరులను గురించి ఎవరికీ తెలియదు. అర్జెంటీనాలో అనేకమంది స్త్రీలను జైళ్లలో నిర్బంధించగా, వాటిలో ప్రసవించిన స్త్రీలు తమ బిడ్డలేమయ్యారో తెలియక గర్భశోకంతో తల్లడిల్లుతున్నారు. ఈ నిరంకుశ పరిస్థితుల్ని ఎదిరించి, మార్చాలని ప్రయత్నిస్తున్నందుకు ఖండం మొత్తం మీద రెండు లక్షలమంది స్త్రీపురుషులు అకాలమృత్యువును వరించారు. మధ్య అమెరికాలోని నికరాగ్వా, ఎల్ శాల్వడార్, గ్వాటిమాలా లాంటి చిన్న, అదృష్టవిహీన దేశాల్లో లక్షమందికి పైగా ప్రాణాన్ని పోగొట్టుకున్నారు. అమెరికా సంయుక్త రాష్ట్రాలలో ఇలాంటిదే సంభవిస్తే పైదేశాలలో జరిగిన జననష్టానికి అనులోమానుపాతంగా పదహారు లక్షల బలవన్మరణాలుండేవేమో!

తోటివాళ్ల పట్ల దయ, ఆదరణ అనూచానంగా వస్తూన్న చిలీ జనాభాలో పదిశాతం - అంటే పదిలక్షలమంది - ప్రజలు దేశం వదిలి పారిపోయారు. మా ఖండంలోని అత్యుత్కృష్ట నాగరిక దేశమైన ఉరుగ్వే ఐదుమందిలో ఒక్కణ్ణి ప్రవాసంలో పోగొట్టుకుంది. 1979 నుంచి నిరాఘాటంగా సాగుతున్న అంతుర్యుద్ధంలో ఎల్ శాల్వడార్ ప్రతి ఇరవై నిమిషాలకి ఒక కాందిశీకుణ్ణి

తయారుచేసుకుంటూంది. లాటిన్ అమెరికా నుంచి పారిపోయిన కాందిశీకుల్నీ బలవంతంగా బయటకు నెట్టివేయబడ్డ వాళ్లనీ కలిపితే నార్వే జనాభా కన్నా ఎక్కువ జనాభా వున్న ఇంకో దేశం ఉద్భవిస్తుంది.

గేబ్రీల్ మార్క్వెజ్ 6 మార్చి 1928న కరేబియన్ రేవు పట్టణం అరకాటకాలో గేబ్రీల్ ఇలిజియే గ్రేసియాకు టాజియా శాంటిగ మార్క్వెజ్ ఇక్వారన్‌లకు జన్మించాడు. ఇతడు మాతామహులు ఇంట పెరిగాడు. 1946లో గ్రాడ్యుయేట్ అయ్యాడు. 1947లో బోగొటాలోని కొలంబియన్ నేషనల్ యూనివర్సిటీలో న్యాయశాస్త్రం చదివాడు. ఇదే సంవత్సరం తన మొదటి కథానిక "The Third Resignation" ను ప్రచురించాడు. తరవాత ఐదుసంవత్సరాలలో 15 కథలు రాశాడు 1955లో అతని ప్రథమనవల 'Leafstorm'.

1958లో మెర్సిడీజ్ బార్చాను పెళ్ళిచేసుకొన్నాడు. అతని ముఖ్యమైన రచనలు :

1. No One writes to the Colonel (1961)
2. In Evil Hour (దీనికి జాతీయ నవలా బహుమతి వచ్చింది)
3. One Hundred Years of Solitude (1965)

(పది మిలియన్ల ప్రతులు అమ్ముడయ్యాయి ఈ నవలకు అనేక బహుమతులు వచ్చాయి. ప్రెమియో చియనాసియానొ (ఇటలీ 1969) ప్రిక్స్ డి మెల్యూర్ లివ్ర్ ఎట్‌రేంజర్ (ఫ్రాన్స్ 1969) ప్రెమియో రొములో గాలెగోస్ (కొలాంబియా 1972), న్యూస్టెడాట్ ఇంటర్నేషల్ ప్రైజ్ ఫర్ లిటరేచర్ 1972), మొదలైనవి ఆ బహుమతులు)

4. In Evil Hour (1979)
5. Love in the Time of Cholers (1988)
6. The Eternal in Him Laybrinth (1990)

''ఐరోపా ముఖ్యభాగం జీవితాన్ని, ఘర్షణలను ప్రతిబింబించే స్వైరతా వాస్తవికతలు సుసంపన్నంగా సంభావించబడిన ఊహా ప్రపంచాన్ని చిత్రించిన నవలను, కథాలను రాసినందుకు'' ఈ బహుమతి.

సంపాదకుడు

వాస్తవికతను మించిన మా ఈ వాస్తవికతే మా సాహిత్య ప్రాభవం కంటే మిన్నగా స్వీడిష్ సాహిత్య అకాడెమీ దృష్టిని ఆకట్టుకుందని వెల్లడించడానికి వెనుకాడను. ఈ వాస్తవికత రచనల కందనిది. ఇది మా అంతరాంతరాలలో నిరంతరం జీవిస్తూ, నిత్యం అసంఖ్యాక మరణాలకు సాక్షీభూతంగా వుంటూ, ఖేదం, సౌందర్యంతో నిండిన అసంతుష్టసర్జనను పురిగొల్పేది, ప్రోది చేసేది. ఈ సర్జనార్తే సంచారిగా, మాతృదేశపరిస్థితుల పట్ల వ్యథితుడుగా వున్న ఈ కొలంబియన్‌కు ప్రత్యేకతను కలగజేసి, మా వాళ్లకంటే పిసరంత అదృష్టాన్ని అందించింది. మా జీవితం ఇలా భయ, దైన్య, దౌర్భాగ్యాలతో వుందని ఇతరులు నమ్మేట్లు చేయడానికి మాకు తగిన సంప్రదాయ సిద్ధమైన వనరులు లేవు. ఇదే మా సమస్యలోని కీలకమైన అంశం. ఇదే మా ఒంటరి ఉనికికీ కీలకమైన కారణం.

ఈ ప్రాంతపు మేధావులు తమ సమున్నత సంస్కృతీ శిఖరాలపై నుంచి మా ప్రాంతపు ఖేదాన్ని, దైన్యాన్ని అవగాహన చేసుకోడానికి సరైన మాధ్యమం దొరకబుచ్చుకోవలేకపోడాన్ని అర్థం చేసుకోగలం. స్వత్వం కోసం పడిన తపన వీరికీ, మాకూ మహా ప్రయాసలతో కూడుకున్నదే ఐనా, రక్తం కాలువలు కట్టిన ప్రయత్నాలతో నిండివున్నా, జీవనవాహినిలో ఎదుర్కొన్న వైపరీత్యాలు మాత్రం వీరికీ మాకూ ఒకటి మాత్రం కావు. అందుకే వారు మమ్మల్ని మదింపువేసే ప్రయత్నంలో వాళ్లని వాళ్లు మదింపువేసుకునేందుకు వాడే కొలబద్దనే వాడబూనుకోడం సహజం. కానీ ఈ విధానం తప్పుడు ఫలితాల నిస్తుంది. ఇది మమ్మల్నింకా మరింత అజ్ఞాతంలోకి త్రోసివేస్తుంది. ఇతోధిక బంధనాలలోనికి నెడుతుంది. ఎక్కువ ఒంటరిగా నిలుపుతుంది. తన గతంలోనుంచే మమ్మల్ని చూడాలనుకునే గౌరవప్రదమైన యూరప్ ఇంకా ఎక్కువ నిశితమైన, అర్థవంతమైన దృక్పథాన్ని అవలంబించుకోవాలి. లండన్ మహానగరం తొలిగోడ నిర్మాణం చేసుకోడానికి మూడొందలేళ్లు పట్టడం, తొలి బిషప్‌ను ఏర్పాటుజేసుకోడానికి మరో మూడొందలేళ్లు పట్టాయని జ్ఞప్తికి తెచ్చుకుంటే, ఎట్రూరియా (ఇప్పటి టస్కనీ) రాజు తొట్టతొలిసారి కాలుమోపిందాకా రోమ్ ఇరవై శతాబ్దాలపాటు అనిశ్చితీ అంధకారంలో బ్రతుకు భారంగా సాగదీసిందని గుర్తుకు తెచ్చుకుంటే, ఇప్పుడు మనలందర్నీ చవులూరించే జున్నులతో, నిర్దయగా కాలనిర్దేశంచేసే గడియారాలతో ఆనందపరిచే స్విట్జరాండ్ ఈ మధ్యకాలం పదహారో శతాబ్దందాకా యూరప్‌ను నెత్తుటేళ్లతో ఉరక లెత్తించిన దోపిడీ సేనగా విశృంఖల విహారం చేసిందనే సంగతి స్ఫురణకు తెచ్చుకుంటే, మా విషయాలు సరైన కోణంనుంచి గోచరమై బాగా అవగాహన అవుతాయి. నవయుగపు మహోచ్చ దశలోనే చక్రవర్తి సేనల నుంచి వేతనం తీసుకుంటున్న పన్నెండువేల జర్మన్ కిరాయి సైనికులు రోమ్‌ని దోచుకుని, విధ్వంసంచేస్తూ ఎనిమిదివేలమంది నిస్సహాయ పౌరుల్ని హతమార్చటం మనకు తెలుసు.

ఏభై మూడేళ్ల క్రితం టామస్ మాన్ సమున్నతంగా ప్రవచించిన టోనినో క్రోగర్ భ్రమలను సాకారం చేయడం నా ఉద్దేశ్యం కాదు. కానీ ఇక్కడ గూడా ధర్మబద్ధమైన, మానవతతో నిండిన మనసులతో మాతృభూమికోసం ఇంకా పోరాటం చేస్తున్న, సుస్పష్టదృష్టి వున్నవాళ్లు మా గురించి పునస్సమీక్ష చేసుకుంటే, అలా వాళ్లకు కలిగిన అవగాహనతో మాకెంతో సాయంజేయగలరనేదే నా ప్రగాఢ విశ్వాసం. ప్రపంచ మంతటా తమ జీవన ప్రభల ధగధగలే వ్యాపించి వున్నాయనే భ్రమ ఆవహించిన ప్రపంచంలోని అన్నిదేశాల ప్రజలు మా కలల సాఫల్యానికి వారు ప్రకటించే సంఘీభావం, తోడ్పాటు కేవలం మాటలతోనే గాక ప్రస్ఫుటమైన వాస్తవ రూపం ధరిస్తేనే తప్ప వారి మంచితనం మమ్మల్ని మా ఒంటరితనం నుంచి దూరం చేయలేదు.

లాటిన్ అమెరికాకి తన ఇష్టంలేకనే రాజకీయ చదరంగంలో పావు అవుదామనే కోరికాలేదు. కారణమూ లేదు. మా స్వాతంత్ర్యం, స్వత్వం కోసం మేం పడే తాపత్రయం యూరప్‌కు కూడా అభిలాష కావాలని మేం కోరుకునేది కేవలం చపలపు ఆలోచనేం కాదు. అదలావుండగా, మా మధ్య అమెరికాలు, యూరప్ మధ్యా దూరాల్ని చెరిపివేసిన నౌకాయానంలోని విశేషప్రగతి చిత్రాతి విచిత్రంగా సంస్కృతీ విషయాల్లో దూరాల్ని అనూహ్యంగా పెంచింది. సాహిత్యంలో మా స్వత్వానికి లభించిన ఇలాంటి మెప్పు సాంఘిక మార్పుల కోసం మేం చేసే ప్రయత్నాల కెందుకు లభించడం లేదు? ప్రగతి శీలక యూరప్ వాసులు త్రికరణశుద్ధితో వాంఛించే సాంఘిక న్యాయం,

విభిన్న పరిస్థితులున్నందువలన వేర్వేరు పద్ధతుల్లో సాంఘికన్యాయంకోసం పోరాడే లాటిన్ అమెరికాకు గూడా తప్పక సిద్ధించాల్సిన లక్ష్యమని ఎందుకు భావించరు? కానీ అలా జరగడం లేదు. మా చరిత్రలోని అవధుల్నధిగమించిన హింస, విషాదం తరతరాల అసమానతల వలనా, ఎందుకు కలిగిందో అంతుచిక్కని ద్వేషం వలన ఆవిర్భవించాయే తప్ప సుదూర ప్రాంతాల నుంచి మాదేశానికి వచ్చి పన్నిన కుట్ర ఫలితమే మాత్రం కాదు. కానీ పుష్కలమైన సాఫల్యతతో నిండిన యౌవనపు కాలాన్ని మరచిపోయి ప్రపంచ నేతలుగా తమను తాము ప్రతిష్ఠించుకున్న ఆ రెండు దేశాల కృపాకటాక్షాలతో బ్రతకటం వినా వేరే పిల్లల మస్తిష్కాల వంటి అపరిపక్వ మస్తిష్కాలతో ఆలోచించే పాతతరపు మనుషుల్లాగే చాలామంది యూరప్ నేతలు ఆలోచిస్తున్నారు. మిత్రులారా, ఇదీ మా ఒంటరి తనపు స్థాయీ, పరిధీను.

అణచివేత, దోపిడీ, నిర్లక్ష్యానికీ గురైనా జీవనానికి స్పందిస్తూనే వున్నాం. వరదలు గానీ, ప్రాణాంతక జాడ్యాలుగానీ, కరవులుగానీ, మరే ఇతర ఉత్పాతాలు గానీ, శతాబ్దాల తరబడీ కొనసాగుతూ కనుచూపుమేరలో ముగింపే కనిపించని యుద్ధాలుగానీ మృత్యువుపై జీవానికున్న ప్రయోజనం మీద మాకున్న నమ్మకాన్ని వమ్ముచేయలేకపోయాయి. ఈ ప్రయోజనం నిరంతరం ప్రవర్ధమాన మౌతుంది. చైతన్య చకచ్చకితమౌతుంది: ప్రతి సంవత్సరం సంభవించే మరణాన్ని మించుతూ ఏడుకోట్ల, నలభై లక్షల జననాలు. ప్రతి సంవత్సరం న్యూయార్క్‌లో నివాసం వుంటున్న జనాభాకంటే ఏడు రెట్లెక్కువున్న జననాలు. ఈ జననాలలో ఎక్కువ భాగం లాటిన్ అమెరికాతో బాటు వనరులలేమితో కునారిల్లుతున్న బడుగు దేశాలదే. ఇలాంటి నేపథ్యంలో మన అదృష్టవిహీన గ్రహంపై నివాసముంటున్న సమస్త జీవకోటీ చకితమయేట్టు, ఇప్పుడున్న ప్రాణులకు వందరెట్లధికమైన ప్రాణుల్ని హతంచేసే మహా విధ్వంసక శక్తుల్ని మహాచ్ఛస్థితిలో వున్న దేశాలు తయారించుకుని కూడబెట్టుకోడంలో 'విజయం' సాధించాయి.

ఇలాంటి ఒకరోజున ఇక్కడే నాకు గురుతుల్యుడైన విల్యమ్ ఫాక్నర్, ''నేను మానవుడి అంతానికి ఒప్పుకోను,'' అని అన్నాడు. విజ్ఞానశాస్త్రం సులభతరంగా చేయగలిగిన ఈ పనిని, ఇప్పటికి ముప్పైరెండు సంవత్సరాల క్రితం ఆయన ఒప్పుకోనని సగర్వంగా చేసిన ప్రకటనని, మానవజాతి ఆవిర్భవించిన మొట్టమొదటి సారిగా ఈ రోజున విజ్ఞానశాస్త్రం అతి సులువుగా చేయగలదనే కఠోరవాస్తవాన్ని నేను విస్మరిస్తే ఈ వేదికపై మీ ముందు నిలబడ్డానికి అనర్హుణ్ణవుతాను. ఇలాంటి దారుణ వాస్తవికతో కూడుకున్నప్పటికీ ఇదే ఆదర్శరాజ్యం అని అనుకునే ఇప్పటి ప్రపంచానికి ప్రతిగా నిజమైన ఆదర్శరాజ్యాన్ని కథా కల్పనాశక్తి వున్న మనమందరం సృష్టించపూనుకోడానికి తరుణం ఇంకా ఏంమించిపోలేదనే విశ్వసించడానికి మనందరికీ హక్కుంది. ఎవరెలా మరణించాలో శాసించే హక్కు ఎవరికీ లేనిదీ, ప్రేమ సత్యమూ, శాశ్వతమైనదనీ ఆనందం అందరు అనుభవించడం సాధ్యమేనని నిరూపించేదీ, వందలాది వర్షాల భయంకర, దైన్య ఏకాకితనం చివరిగా, శాశ్వతంగా అంతరింపజేసుకున్నదీ అయిన అతి విశాలమైన సరికొత్త ఆదర్శరాజ్యం అందరి అనుభవంలోకి వచ్చేట్లు అందరం కృషి చేయాలి.

**గమనిక: 'మిసిమి'** 9 సంపుటి 12వ సంచికను 10 వ సంపుటి 1 వ సంచికగా పరివర్తించడం అయింది. జనవరి నెల ఒకటో సంచిక, ఫిబ్రవరి నెల రెండో సంచిక, మార్చినెల మూడో సంచిక - ఇలా నెలతో సంచిక సంఖ్య ఏకీభవించడానికి ఈ మార్పు చేయడమైంది.

# ఎరిక్ ఫ్రామ్ సిద్ధాంతం

- అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి

ఎరిక్ ఫ్రామ్ మీద మనోవిజ్ఞానశాస్త్ర వేత్తగా ఫ్రాయిడ్, రాంక్‌లు ప్రభావం పడితే, సమాజశాస్త్ర వేత్తగా మార్క్స్ ప్రభావం పడింది. అసలతడు సామాజిక మనోవిజ్ఞానశాస్త్రవేత్తగా, ఫ్రాయిడియన్ మనో విశ్లేషకునిగా తరిఫీదు పొందాడు. ఆకారణంగా అతడు వ్యక్తి - సమాజం మధ్య సంబంధాన్ని లోతుగా పరిశీలించాడు. అతడు రాసిన "Escape from Freedom" 1941లో అమెరికాలో ప్రచురితమైంది. ఆ తరవాత సంవత్సరంలో అదే పుస్తకం బ్రిటన్‌లో "The Fear of Freedom" అనే పేరుతో ప్రచురితమైంది. ఈ గ్రంథంలో అతడు ఆధికారికవాద (authoritariainism) సమస్యను పరిశీలించాడు. ఈ పరిశీలనలో అతడు తన మూర్తి మత్వ సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. ఇది చాల వరకు ఫ్రాయిడ్ సిద్ధాంతం మీదే ఆధారపడినా, చాల ముఖ్యవిషయాలలో దానితో విభేదిస్తుంది. ఇక్కడ మనం ఫ్రాయిడ్ సిద్ధాంతం గురించి కొంచెం ముచ్చటించ వలసి ఉంది. ఫ్రాయిడ్ ప్రకారం మనిషి, సమాజాల మధ్య ప్రాథమిక వైరుధ్యం ఉంది. అంతే కాదు, మనిషి సహజంగా స్వభావ రీత్యా సమాజ వ్యతిరేకి. అందుకుని సమాజం అతనిని మచ్చిక చేసుకోవలసి ఉంది. మనిషిలోని సహజాత్వాలు అభివ్యక్తిని కోరతాయి.. తృప్తిని కోరతాయి. కాని వాటి అవ్యవహిత తృప్తిని సమాజం అంగీకరించదు. అటువంటప్పుడు వాటిని సంస్కరించి, అదుపు చేసి సమాజం అంగీకరించిన మార్గాల్లో బహిర్గతం కానీయాలి. దీనినే ఉదాత్తీకరణం అంటారు. ఈ ఉతాత్తీకరణం ఫలితంగానే మననాగరికత అంతా ఏర్పడింది. దీనిని కనుక మనం ఒప్పుకొంటే ప్రతి సమాజంలోను మనిషి సహజాత సంతృప్తికి - అతని సాంస్కృతిక వికాసానికి మధ్య విలోమ సంబంధం ఉంటుంది. అంటే సహజాతాల (insticts) అణచివేత ఎక్కువైన కొలది నాగరికతా వికాసం ఎక్కువ అవుతుంది. నాగరికతా వికాసం పెరిగిన కొలదీ న్యూరోసిస్ (నాడీరుగ్మత) పెరుగుతుంది. అణచివేత తక్కువైతే నాగరికత స్థాయి తక్కువగా ఉంటుంది. ఫలితంగా న్యూరోసిస్ తక్కువగా ఉంటుంది.

ఫ్రాయిడ్ ప్రకారం సమాజం మార్పు లేనిది. అతడిదృష్టిలో మానవ స్వభావం అంటే మానవ శీలలక్షణాలైన వాంఛా వికారలు, వ్యాకులతలు. ఇవి జైవికాల (biological) ని అతడిఉద్దేశం. కాని ఫ్రామ్ ఒప్పుకోడు. ఫ్రాయిడ్ సిద్ధాంతాన్ని ఫ్రామ్ మార్క్స్ పరిభాషలో విమర్శిస్తాడు. ''మానవ సంబంధాలను ఫ్రాయిడ్ చేసే తీరు పెట్టుబడి దారీ సమాజంలోని ఆర్థిక సంబంధాలు లాగే ఉంటాయి. పెట్టుబడి దారీ సమాజంలో ప్రతివ్యక్తి తనకై తాను పనిచేసుకొంటాడు. రిస్కు తనదే. అయినా అతడు ఏకాకిగా మనలేడు. అతనికి ఇతరులు కావాలి. కొనేవారు, అమ్మే వారు ఉండాలి అతడు కొనాలి, అమ్మాలి, ఈ సంబంధాలను మార్కెట్టు నియంత్రిస్తుంది. దీని అర్థం ఏమిటంటే, మనిషి ప్రారంభంలో స్వయం సమృద్ధుడు ఒంటరివాడు అనీ, ఆతరవాతే అతడు ఇతరులతో సంబంధాలు పెట్టుకొని ఇతరులను పరికరాలుగా వాడుకొంటాడు. ఫ్రాయిడ్ దృష్టిలో మానవసంబంధాలుగూడా ఇదే తీరులో ఉంటాయి. మనిషిపుట్టుకతో కొన్ని జైవిక ఉత్సుకతలతో (biological drives) పుడతాడు. వాటిని అతడు సంతృప్తం చేయడానికి, ఇతరులతో సంబంధాలు పెట్టుకొని, వారిని వస్తువులలాగా వాడుకొంటాడు. మానవ సంబంధాల క్షేత్రం ఫాయిడ్ దృష్టిలో ఒక మార్కెట్.

ఫాయిడ్ సిద్ధాంతంలో అంతర్గతంగా ఉన్న ఈ భావనలను ఫ్రామ్ త్రోసిపుచ్చి, తన సిద్ధాంతాన్ని

ఈ క్రింది రెండు ప్రాతిపదికల మీద నిలుపుతాడు. (a) ఒక సహజాతం సంతృప్తి కావడం కాకపోవడం అనే దానితో మనోవిజ్ఞాన శాస్త్రానికి సంబంధంలేదు. తన చుట్టూ ఉన్న ప్రపంచానికి వ్యక్తి ఎలా ప్రతిస్పందిస్తున్నాడు. దానితో ఎటువంటి సంబంధాలను నెలకొలుపుకుంటున్నాడు, ఎటువంటి సంబంధ తత్త్వా (relatedness) న్ని కలిగి ఉన్నాడు అనేదే మనోవిజ్ఞాన శాస్త్ర సమస్య (b) వ్యక్తి - సమాజాల మధ్యసంబంధిత ఫ్రాయిడ్ భావించి నట్లు నిశ్చల (స్థిర) మైనది కాక నిరత పరివర్తన శీలి. ఒక ప్రక్క వ్యక్తి పుట్టుకలోనే కొన్ని జైవిక ఉత్సుకలతో (biological drives) పుడతాడు, మరో ప్రక్క సమాజానికి వాటిని సంతృప్తం చేసేది, లేదా కుంఠనం చేసే సామర్థ్యం ఉంటుందనడం సరికాదు. ఆకలి దప్పులు, లైంగికత లాంటి శారీరక ఉత్సుకతలు ప్రాథమికంగా ఉండే మాట నిజమే అయినా, ప్రేమ, ద్వేషం, అధికారదాహం, ఇతరులకు వశం కరుడు కావడం లాంటి శీల లక్షణాలు సామాజిక ప్రకియల ద్వారా అవిర్భవించినవే. సమాజం చేసేపని అణచివేయడమే కాదు, సృష్టిస్తుంది కూడా. మనం మామూలుగా ''మానవస్వభావం'' (human nature) అనేది సమాజ సృష్టి. మానవ స్వభావాన్ని కేవలం జీవస్వభావంతో పూర్తిగా వివరించలేము. వాస్తవానికి ''మానవ స్వభావ సృష్టికర్త'' మనిషే. కావాలంటే చరిత్ర చూడండి. కొన్ని ప్రత్యేక యుగాలలో మాత్రమే మానవ మూర్తిమత్వం (Human personality) లో కొన్ని నిర్దిష్టమైన ప్రత్యేక మార్పులు సంభవించాయి. ఉదాహరణకు మధ్యయుగాల నాటి దృష్టి పునర్వికాసయుగం నాటి దృష్టికంటె భిన్నమైంది. ఎందుకని! ఫ్రాయిడ్, క్లైయిన్ లాంటి శాస్త్రజ్ఞులు సామాజికసమస్యలన్నింటిని వైయక్తిక మనో విజ్ఞానశాస్త్రం (individual psyshology) ద్వారా వివరించ ప్రయత్నిస్తే, దుర్క్‌హైమ్, మార్క్స్‌లాంటి పండితులు వ్యక్తి ప్రవర్తన (individual behaviour) ను సామాజిక పరంగా వివరించ ప్రయత్నించారు. ఫ్రామ్ ఈ రెండు ధోరణులను తిరస్కరించాడు. మోహవికారాదులు, వాంఛలు, వ్యాకులతలు సామాజిక ప్రక్రియల ఫలితంగా ఎలా మార్పుకు లోనవుతాయో చూపించడమే కాక, ప్రత్యేకరూపాలలోకి మలచబడ్డ మానవశక్తులు (human energies) సామాజిక ప్రక్రియను మలిచే ఉత్పాదక శక్తులుగా మారతాయని అతడు చెప్పదలచుకొన్నాడు. చరిత్ర మానవుని తయారు చేయడమే కాదు, మానవుడు చరిత్రను నిర్మించాడు.

ఇక్కడ మనం ఫ్రాయిడ్ ఉపయోగించిన సహజాతా (instrcit) న్నిగురించి అర్థంచేసుకోవాలి. అసలు సహజాతాన్ని రెండు రకాలుగా ఉపయోగిస్తారు. (1) నాడీమండలం నిర్మితి నిర్దేశించిన రీతిలో జరిగే విశిష్ట చర్యల రీతి. ఉదాహరణగ చీమల, తేనేటీగల ప్రవర్తనను చెప్పవచ్చు. 2. శారీరక అవసరాలు లేదా ఉత్సుకతలు (biological nedds or drives) అనే అర్థం. పిచ్చుకగూడు నేర్చుకోకుండానే కడుతుంది. దానికి ఆప్రవర్తన ఎలా వచ్చింది? అంతస్సిద్ధంగా. ఈ అర్థంలో సహజాతం మొదటి తరగతికి చెందుతుంది. ఇహ రెండోది శారీరకావసరాల అర్థంలో సెక్సు, ఆకలి, దప్పిక మొదలైనవి వస్తాయి. ఈ అర్థంలో సహజాతాలు ఒకచర్య ''ఎందుకు'' మొదలవుతుందో చెబుతాయేగాని, ''ఎక్కడ'' ''ఎప్పుడు'' ఆ చర్య జరుగుతుందో వివరించవు. అంటే మనిషికి జంతువుకు లాగే ఆకలిదప్పుల లాంటి సహజాతాలున్నాయిగాని, వీటిని సంతృప్తం చేసుకొనే సమయ సందర్భాలు సమాజం నిర్ణయిస్తుంది. జంతువులకు సమయ సందర్భాలు లేవు. మనుషులకు సహజాతాలున్న మాట నిజం. కాని వీటిని సంస్కృతి నిర్బంధిస్తుంది.

అంటే ఎతావాతా తేలింది ఏమిటంటే: సమాజానికి, ప్రపంచానికి, తనకు వ్యక్తి ఎలా ప్రతి

స్పందిస్తాడు, ఎలా తనను తాను ఎరుక చేసుకొంటాడు. ఎలా తనను తాను సంబంధింప చేసుకొంటాడు - అనేది మనో విజ్ఞాన శాస్త్ర ప్రధాన సమస్య. ఏదో ఒక ''పద్ధతిలో'' అతడు సంబంధింప చేసుకొంటాడు. ఆ ''పద్ధతి'' పుట్టుకతోరాదు. ఆ ''పద్ధతి'' అభ్యసనం ద్వారా, లేదా సంస్కృతీకరణం ద్వారా వ్యక్తి ఆర్జించుకొంటాడు. కనుక మానవ ప్రవర్తనను కేవలం శారీరక అవసరాల సంతృప్తి అసంతృప్తి ద్వారా మాత్రమే అర్థం చేసుకోలేము. 'పద్ధతి' గూడ ప్రవర్తనలో భాగమే. అంతేకాదు, సామాజిక ప్రక్రియ, శారీరకావసరాల కంటె భిన్నంగా, నూతన అవసరాలను సృష్టిస్తుంది. ఈ నూతనావసరాలు శారీరకావసరాల కంటె ప్రబలమైనవి గూడ కావచ్చు. కొంతమంది తమ విశ్వాసాల కోసం ప్రాణాలనే ఇస్తారు. తామునమ్మిన మత విశ్వాసాల కోసం, దేశం కోసం ఏమైనా చేసేవారున్నారు. తను ఆకలితో చచ్చిపోతున్నా తన దగ్గర ఉన్న చివరి రొట్టె ముక్కను దానం చేసే వారున్నారు. ఈరకం మానవ ప్రవర్తనను సహజాతాలతో వివరించలేము.

పరిణామం అంటే అంతర్గతంగా ఉన్నవాటిని మరో అమరికతో బహిర్గతం చేయడం మాత్రమే కాదు. పరిణామ క్రమంలో నూతన గుణాలుపుడతాయి. అందులో మానవుని విషయంలో నూతన లక్షణాలు ఆవిర్భవించాయి. ఈ లక్షణాలు మనిషికి జంతువుకు మధ్యదూరాన్ని పెంచాయి. ఏ ఇతర జీవికంటే మానవుడు తాను ఒక వేరు జీవినని తెలుసుకొన్నాడు. అంతేకాదు, ప్రతీకల రూపంలో ఎంతో విజ్ఞానాన్ని నిలువ చేసుకొని, భావి సంభావ్యతలను అంచనావేసి, తన జ్ఞానేంద్రియాల పరిధినిధాటి తన ఆలోచనతో ఎంతో దూరం చూడగలుగుతున్నాడు. సచేతనంగా అతడు పరిసరానికి అనుగుణంగా సర్దుబాటు చేసుకొంటూ దానినే మారుస్తున్నాడు. అతడు విలక్షణ జీవి. ప్రకృతిలో ఒక వింత. ప్రకృతిలో భాగంగా ఉంటూ, దాని భౌతిక ధర్మాలకు లోబడి ఉంటూనే, దానిని అధిగమిస్తున్నాడు. తాను పుట్టిన తలిదండ్రులకు ఎందుకు పుట్టాడో, ఆసమయంలోనే ఎందుకు పుట్టాడో, ఆ ఊరిలోనే ఎందుకు పుట్టాడో తెలియకుండానే పుట్టాడు. ఒక సమయంలో, ఒక స్థలంలో యాదృచ్ఛికంగా ఈ ప్రపంచంలోకి విసరివేయబడ్డాడు. అలాగే ఎందుకు మరణిస్తున్నాడో తెలియకుండానే ఈ ప్రపంచంనుంచి విసరివేయబడుతున్నాడు. ఇదీ యాదృచ్ఛికమే. తనను గురించి తాను తెలుసుకోవడంలో తన అస్తిత్వ పరిధులను, తన శక్తి హీనతను గుర్తించాడు. తన అంత్యాన్ని, మరణాన్ని గుర్తిస్తున్నాడు. తన అస్తిత్వవైరుధ్యాల నుంచి అతడు బయట పడలేకపోతున్నాడు. ''కావాలన్నా తన మనస్సును వదిలించు కోలేక పోతున్నాడు. అలాగే బ్రతికివున్నంతకాలం తన శరీరాన్ని వదిలించుకోలేక పోతున్నాడు.పైగా అతని శరీరం అతనిని బతకకోరమంటుంది.''

మన ఇష్టంతో సంబంధం లేకుండానే మనం పుట్టాం, మనంగిడుతున్నాం, చారిత్రక ప్రక్రియలో బహు అల్పకాలం మాత్రమే మనం ఇక్కడ వుంటున్నాం, ఆ సమయంలో సాంస్కృతిక స్థాయి అనుమతించిన దానికంటె మన సమర్థతలు దాటి పైకి పోలేక పోతున్నా, అనే ఈ ప్రాథమిక అస్తిత్వ సత్యాలను ఫ్రామ్ అస్తిత్వ వైరుధ్యాలు అనిపిలిచాడు. వీటిని అతడు చారిత్రక వైరుధ్యాలకంటే భిన్నాలన్నాడు. పట్టుదల, సమయం ఉంటే చారిత్రక వైరుధ్యాలను మనిషి పరిష్కరించగలడు. యుద్ధం. అన్నీ సమృద్ధంగా ఉండి కూడా ఆకలితో చావడం, ఘుగ్మతలు మొదలైన చారిత్రక వైరుధ్యాల వల్ల బాగుపడేవారు, ఎప్పుడూ అవి ఉండాలంటారు. పైగా వాటిని మానవ జీవితంలో అనివార్య, అపరిహార్య భాగాలుగా వారు చిత్రిస్తారు.

విరుద్ధాలు, ప్రహేళికలు, అసంగతాలు ఉంటే మనస్సు చూస్తూ ఊరుకోదు. వాటిని

పరిష్కరించేవరకు అది నిద్రపోదు. దానికది సహజం. అలాంటప్పుడు సమాజంలో ఉండే వైరుధ్యాలు సామాజిక జీవితంలోని అసంగతాలు (చారిత్రక వైరుధ్యాలు) కు మనుషులు ఎదురు తిరగకుండా ఉండాలంటే, అసలక్కడ వైరుధ్యాలు, ఎక్కువ తక్కువలు, హీనవర్గాలు ఉన్నత వర్గాలు లేవనీ అవి సహజమేననీ చెప్పవలసి ఉంటుంది. అదే మన ఆదర్శ సిద్ధాంతాలు వల్లించేది. భాగ్యవంతుడు మేడల్లో, పేదవాడు గుడెసెల్లో, ఎందుకుంటున్నారంటే, ''చేసుకొన్న వాడికి చేసుకొన్నంత'' అనే కర్మ సిద్ధాంతంలో, వర్ణ విచక్షణ ఎందుకు ఉందీ అంటే'' చాతుర్వర్ణ్యం మయాస్రష్టం'' లాంటి సిద్ధాంతంతో సమర్థించారు, యుక్తీకరించారు. తాను కేవలం ఒక భౌతిక సూత్రంతోనో లేదా బౌద్ధిక సూత్రంతోనో నియంత్రితం కాక, ఒక నైతిక సూత్రంతో నడపబడుతున్నాననే సామాజిక అవసరం **(social need)** మనిషిలో ఉంటుంది. ఏ ఆదర్శ సిద్ధాంతమైన ఇలాంటి అచేతన అవసరాన్ని సంతృప్తం చేస్తుంది.

ఈ విశ్వం ఎలా వచ్చింది? ఇలాగే ఎందుకున్నది?. ప్రకృతికి మనిషికి మధ్య తూకం ఎలాంటిది? లాంటి ప్రశ్నలకు సమాధానం వెతకాల్సిన ఆవశ్యకత, పై వైరుధ్యాల కారణంగానే, మనిషిలో ఆవిర్భవించింది. అస్తిత్వ, చారిత్రక వైరుధ్యాల కారణంగా మనిషికీ, విశ్వానికీ, మనిషికీ- మనిషికీ, తనకు - తనకూ మధ్య బాహిరతలు, మెరమెరలు, అసంగతాలు ఏర్పడ్డాయి. ఈ బాహిరత, పరాయితనాలను అర్థంచేసుకోవడానికి ఒక అభివిన్యాసం - భక్తి చట్రం **(From of orientation and devotion)** అవసరమైంది. ఈ చట్టం సార్వజనీన మతరూపం తీసుకొంటుంది. ఫ్రాయిడ్‌కు మతం సార్వజనీన నాడీ రుగ్మత అయితే, అది ఫ్రామ్‌కు వ్యక్తిగత మతం అవుతుంది. కమ్యూనిస్టు దేశాల్లో అది లౌకిక, ఇతర దేశాల్లో అది అలౌకిక మతం అవుతుంది. ఇటువంటి చట్రం **(Frame)** ఆవశ్యకత, ఫ్రామ్ దృష్టిలో, ప్రాథమిక సర్వసంకలిత వాంఛ అవుతుంది. ఈ వాంఛనే విలియమ్ జేమ్స్ ''ఈవిశ్వంలో పరాయి ఇంటిలో ఉన్నట్లు కాక, స్వంత యింటిలో ఉన్నట్లు ఉండే వాంఛ'' అన్నాడు.

ప్రతి మనిషి ఏదో ఒక సమాజంలో పుడతాడు. ఆ సమాజానికి ఒక నీతి, కట్టుబాట్లు, ఆర్థిక వ్యవస్థ ఉంటాయి. ఇవి అతని మూర్తిమత్వాన్ని **(personality)** , నిర్దేశిస్తాయి. అంతమాత్రంచేత అతడు తన మూర్తిమత్వాన్ని ఆ తరవాత మార్చుకోలేడని, సమాజ నీతి, ఆర్థిక వ్యవస్థలను అతడు తన స్వయం కృషితో మార్చలేడని అర్థం కాదు. అయితే మొదట అతడు పుట్టిన కుటుంబం, అతనికి ఆ సమాజ శీల లక్షణాలను ఆపాదిస్తుంది.

మానవుని మూర్తిమత్వం **(personality)** కొన్ని కొన్ని చారిత్రక ఘట్టాల్లో మారుకొంటూ వచ్చింది. ఈ విషయాన్ని ఫ్రామ్ **"The Fear of freedom"** లో చర్చించాడు. మానవుని చరిత్ర అతడు ప్రకృతితో అవ్యవపాతంగా కలిసిపోయి ఉన్న స్థితి నుంచి ప్రారంభమవుతుంది. ఆ తరవాత వ్యక్తి ప్రకృతినుంచి క్రమక్రమంగా విడివడి, దూరం కావడాన్ని చారిత్రక ప్రక్రియ అభివ్యక్తీకరిస్తుంది. మొదట అతడు తన చుట్టూ ఉన్న మనుషులతోనే కాక, సూర్యచంద్రులు, చెట్టుచేమలతో సంలీనం చెంది ఉంటాడు. ఈ తాదాత్మ్యత అతనిని ''ఒంటరితనం'' నుంచి రక్షిస్తుంది. ఒంటరితనం నుంచి రక్షించే మాటనిజమేకాని, అతడు తనను తాను నిర్దేశించుకునే ఉత్పాదక వ్యక్తిగా మాత్రం మన లేడు. అయితే ఈ బాధ, ఏకాంతబాధ అంత కఠినమైంది కాదంటాడు ఫ్రామ్. ప్రకృతి పై ఆధిపత్యం, వైయక్తీకరణం **(individuation)** సమతూకంలో పెరిగినట్లయితే

బాగుండేది కాని అలా జరగడం లేదు. వైయక్తీకరణ పెరిగిన కొలదీ అభద్రత, నూతన సంఘర్షణలు ఎక్కువవుతున్నాయి.

మధ్యయుగాలనాటికి మనిషి ప్రకృతితో విడవడి దూరం జరిగినా. సమాజంలో అంతర్భాగంలోనే ఉన్నాడు. వ్యాపార లక్షణాలు ప్రవేశించే వరకు ప్రయాణ సౌకర్యాలు పెరిగే వరకు సామాజిక వ్యవస్థ ఏమార్పులు లేకుండానే ఉంది. ఆర్థిక వ్యవస్థ నడత లన్నింటినీ మతమే శాసించింది. మార్కెట్ ఎగుడు దిగుడులను బట్టికాక, న్యాయమైన ధరలను (fair prices) మతమే ప్రభావితం చేసింది. భూమి విశ్వానికి కేంద్రంగా ఉండేది. చాల చిన్నదిగా ఉండేది. అప్పుడు ఈతి బాధలు ఉన్నా మతం అందరికీ దేవుని ప్రేమకు అర్హతను కల్పించింది. అయితే ఇది అపరాధ భావనను గూడ పెంచింది. పుట్టినప్పటి నుంచి మరణించే వరకు అన్ని చర్యలలోను కార్యకారణతా పారదర్శకత గోచరించింది. మరి ఇటువంటి పరిస్థితులలో మానవుడు ''బందీగా'' జీవించాడని భావించవచ్చు. అలా కాదు. ఎందుకంటే ఆరోజుల్లో వ్యక్తి (individual) లేడు గనుక, వ్యక్తి స్వాతంత్ర్యం హరించివేయబడిందనే ప్రశ్నే లేదు. తాను తన జాతి, కుటుంబం కంటే భిన్న మనే స్పృహే అతనికి లేదు. అయితే ప్రైవేటు పెట్టుబడి, పోటీ వ్యాపారం, స్వేచ్ఛా విఫణిలు ప్రవేశించడంతో స్థాణువైన ఫ్యూడల్ వ్యవస్థ బీటలు వారి, ''పునర్వికాసం''తో ''వ్యక్తి'' (individual) అవతరించాడు. ఈ వ్యక్తికవాదం, కళ, తత్త్వం, అభిరుచులు, అన్ని మానవరంగాలలో ప్రవేశించింది. బ్రహ్మాండమైన చర్చిలను నిర్మించిన మహా శిల్పి అంతకు ముందు అనామకంగా ఉంటే, ఇప్పుడు శిల్పి పేరు ప్రముఖంగా ప్రకటించవలసి వచ్చింది. దుస్తులు మారాయి. నగ్న దేహ చిత్రణ మొదలైంది. సామాజిక నిశ్రేణిలో దిగువవాడు పైకి, పైవాడు క్రిందికి చలించే అవకాశం కలిగింది. ముసుగులు చెరిగి పోయాయి మనిషి ''ఆధ్యాత్మిక వ్యక్తి'' అయ్యాడు.

ఈ నూతన వ్యక్తిక వాదం (individulism) తో స్వేచ్ఛ, స్వయం స్పృహ (self awarenss) అయితే వచ్చాయి. కాని, ఔద్వేగిక భద్రత (emotional security) పూర్తిగా పోయింది. సంప్రదాయ బానిసతనం నుంచి నిశ్చిత, అంతస్తు, పాత్ర (fixed stations and role) ల నుంచి విముక్తుడవడంతో పాటు, తనకు భద్రత నిచ్చిన, ''మన'' అనే అనుభూతినిచ్చిన బంధాలనుంచి గూడ విముక్తుడయ్యాడు. సంస్కరణ యుగంతో మతంలో కూడ ఇవే లక్షణాలు ప్రవేశించాయి.

ఒక నాడు ప్రకృతితోను, సమాజంతోను అవ్యవహితంగా ఉన్న ఐక్యతను మనిషి తెంచుకొని, ఈ చారిత్రక ప్రక్రియలో, ఇప్పుడు ఏకాకిగా మిగిలాడు. ముఖ్యంగా ఈ ఏకాకితనానికి కారణం ఆర్థిక వ్యవస్థలలో వచ్చిన మార్పులు పెట్టుబడిదారీ విధానం, స్వేచ్ఛా విఫణిలు. మధ్యయుగాల నాటి భద్రత ''మనిషికి కరవు కావడంతో, స్వేచ్ఛలభించడంతో, ''వ్యక్తి'' అవతరించడంతో తలెత్తిన సమస్య ఏమిటంటే, ''అంతస్తు కోసం పెనుగులాట'', ''అనామకుడుగా ఉండడం కంటె నామకుడుగా ఉండడం.'' ఈ పోటీ ప్రపంచంలో, ఈ స్వేచ్ఛ కోసం ఎంత మూల్యం చెల్లిస్తున్నాడో ఆ సమస్యను చూస్తుంటే అర్థం అవుతుంది. పోటీ ఒత్తిడికి తట్టుకోలేక ఏదో ఒక అధికారిక వ్యవస్థకు తల ఒగ్గి, ''ఈ స్వేచ్ఛ మాకొద్దు'', అని స్వేచ్ఛ నుంచి పారి పోయే (escape from freedom) స్థితి ఏర్పడుతుంది.

జీవన క్రమంలో మనిషి రెండు రకాలుగా ''తనను ఈ ప్రపంచానికి సంబంధింప జేసుకొంటాడు. మొదటిది వస్తువులను సంపాదించి వాటిని జీర్ణింప చేసుకోవడం ద్వారా, రెండోది తనను

ఇతరులకు, తనకు సంబంధింప జేసుకోవడం ద్వారా. మొదటి దానిలో మనిషి వస్తువులను ఉత్పత్తి చేయడం ద్వారా, బాహ్యమూలం నుంచి గ్రహించడం ద్వారా, ఏదో విధంగా అవసరాలు తీర్చుకోవాలి. రెండో దానిలో, రాగద్వేషాల ద్వారా, పోటీ సహకారాల ద్వారా; ఒక సామాజిక వ్యవస్థను నిర్మించడం ద్వారా అతడు ఏదో విధంగా తనను ఇతరులతో సంబంధింప జేసుకోవాలి. - ఏ పద్ధతిలో తనను ఇతరులతో, తనతో సంబంధింప జేసుకొంటున్నాడు అనేది అతని శీలాన్ని తెలియ జేస్తుంది. ఇతరులతో సంబంధింప జేసుకోవడం ఐదు విధాలు. స్వపీడన కామం **(Masochism)** పరపీడన కామం **(sadism)** వినాశం **(destricutiveness)** స్వయం చాలక అనుగుణ్యత **(Automotion conformity)** ప్రేమ **(Love).** ఈ ఐదింటికి సదృశ్యమైన సామాజికసంలీనీకరణ విధానాలు: గ్రాహక **(receptive),** దోపిడి **(exploitative)** నిలువచేయడం **(hoarding),** అమ్మకం కొనుగోలు **(marketing),** ఉత్పాదక **(Productive).** అయితే ఈ శీల లక్షణాలు శుద్ధరూపంలో కాక, వ్యక్తులలో కలగా పులగంగా కనిపిస్తాయి. శీలం అంటే ఫ్రామ్ దృష్టిలో సంలీనీకరణ, సామాజికీకరణ ప్రక్రియలలో సాపేక్షంగా స్థిరమైన విధానంలో మానవశక్తి ప్రవహించడం.

1 గ్రాహకశీలం **(The receptive character):** వస్తువులు గాని, జ్ఞానంగాని, సుఖంగాని, ప్రేమగాని ఈ బాహ్య మూలం నుంచి తాను ఏమీ చేయకుండానే దక్కాలని ఎదురు చూచే లక్షణం. పరాలంబనం. ఫ్రాయిడ్ మౌఖికశీలం.

2. దోపిడి శీలం **(The exploitative character):** యుక్తితో, జిత్తులతో దౌర్జన్యంగా ఇతరులను దోచుకోవడం. ఫ్రాయిడ్ మౌఖిక దౌర్జన్య శీలం.

3. సంచయన శీలం **(The hording character):** నిలవ, పొదుపు ద్వారా భద్రతను ఆశించడం. ఇతడు క్రమబద్ధంగా, సమయపాలన చేసే వాడుగా ఉంటాడు.

4. విపణి శీలం **(The Marketing character):** స్వయం చాలక అనుగుణ్యత మీద ఆధారపడిన సామాజీక కరణ ప్రక్రియ. ఇందులో ''ఇతరులకు అనుగుణంగా మారడం, తనను ఇతరులకు అమ్ముకోవడం ''లాంటి ప్రవృత్తులు ఉంటాయి. తమ మూర్తి మత్వాలను వీరు అంగడి వస్తువులుగా భావిస్తారు. ఫ్రాయిడ్ శిశ్నశీలం.

5. ఉత్పాదకశీలం **(The productive character)** ఇతడు మామూలు మనిషి. ఇతరులతో నిజమైన ప్రేమ బంధాలను ఏర్పరుచుకోగలుగుతాడు. తనలో అంతర్గతంగా ఉన్న శక్తిసామర్థ్యాలను ఉపయోగించి యధార్థీకరణ చెందించు కోగల శక్తి ఇతనికి ఉంటుంది. ఫ్రాయిడ్ జననాంగశీలం.

ఫ్రాయిడ్‌కు లాగ ఫ్రామ్‌కు స్వీయ ప్రేమ **(self love),** పరప్రేమ **(love for others) -** ఈ రెండూ వ్యతిరేకాలు కావు. తనను తాను ప్రేమించుకొంటే, ఇతరుల మీద ప్రేమ తగ్గుతుందనడం సరికాదు. ప్రేమ - యదార్థ ప్రేమ, అవిచ్ఛిన్నం. అది ఉత్పాదకతను ప్రతిబింబిస్తుంది. దానిలో సంరక్ష, గౌరవం, బాధ్యత, జ్ఞానం ఉంటాయి. అది ఒక దానికి ఫలితం **(effect)** కాదు. ప్రేమించిన వ్యక్తి ఎదుగుదలను సుఖసంతోషాలను ఆకాంక్షిస్తుంది. ఆధునిక సంస్కృతితో వచ్చిన బాధ ఏమిటంటే జనం స్వార్థంతో కొట్టుకు పోతున్నారనికాదు, వారు తమ నిజమైన ఆత్మ **(self)** ను పట్టించుకోవడం లేదని, వాళ్ళు తమను తాము నిజంగా ప్రేమించు కోవడం లేదని. స్వీయ ప్రేమకు, ఇతరులను ప్రేమించడానికి మధ్య వైరుధ్యం లేదంటాడు ఫ్రామ్.

# నవ్వు నాలుగందాల గ్రేట్

కె. సింగయ్య

ఆగష్టు 97 మిసిమిలో మిసిమి రచనల వర్క్‌షాపు వారు వ్రాసిన నవ్వునాలుగు అందాలచేటా? అనే చిన్నవ్యాసం బాగుంది.

ఈ సందర్భంగా తిక్కన నవ్వించిన నవ్వులు గుర్తు చేసుకొందాం.

1. పిన్ననవ్వు, 2. చిఱునవ్వు, 3. అల్లన నగవు, 4. అలతి నవ్వు, 5. మంద స్మితము, 6. హర్ష, 7. అంతస్మితము, 8. జనిత మందస్మితము, 9. ఉద్గత మందస్మితము, 10. అనాదరమందస్మితము, 11. సాదర దరహాసము, 12. తిన్నని నవ్వు, 13. లేతనవ్వు, 14. కొండొక నవ్వు, 15. పెలుచనవ్వు, 16. ఉబ్బు మిగిలిన నవ్వు, 17. గేలికొను నవ్వు, 18. ఒత్తిలి నవ్వు, 19. అపహాసము, 20. రోష కఠినం బౌహాసము, 21. ఉద్భటహాసము, 22. కలకల నవ్వు, 23. ఎలనవ్వు, 24. ప్రౌఢస్మితము, 25. బెట్టునవ్వు, 26. కన్నులనవ్వు, 27. కినుకమానిన నవ్వు, 28. కటిక నవ్వు, 29. నవ్వుగాని నవ్వు, 30. ఎఱ్ఱనవ్వు.

అలనాటి 'శంకర్స్ వీక్లీ' ఇంగ్లీషులో విజయవంతమైతే హిందీలో 'శంకర్స్ వీక్లీ' కొద్ది కాలంలోనే మూతపడింది. బహుశా మనం ఇంకొకళ్ళని చూసినవ్వుకోవడానికి ఇష్టపడతాముగాని, మనల్ని జూసి మనం నవ్వుకోవడానికి ఇష్టపడమోమో! ప్రఖ్యాత జర్నలిస్టు చలపతిరావుగారు పేర్కొన్నట్లు హాస్యం అనేది లేకపోతే, జీవించడమే వేస్టు. ప్రఖ్యాత కవి, నాటకరచయిత కీ.శే. పానుగంటి లక్ష్మీ నరసింహారావుగారు తన మాలతీ మాధవం నాటకంలో నవ్వు ప్రాముఖ్యాన్ని ఈ క్రింది విధంగా సెలవిచ్చారు. '

'సరసమగు నవ్వు జగతికి సౌఖ్యమొసగు
విరసమగు నెడ జగతికి ఏడనిచ్చు
నవ్వుచే కొన్ని రోగముల్ నాశమొందు
నవ్వు చేత దీర్ఘాయువు నివ్వటెల్లు''

హాస్యము ఆనందానికి, ఆరోగ్యానికి సంకేతం అనుభావమునునుసరించి ఒకానొక రచయిత హాస్య రసాన్ని ఆరు విధాలుగా పేర్కొన్నాడు.

1. స్మితము, 2. హసితము, 3. విహసితము, 4. అవహసితము, 5. అపహసితము, 6. అతిహసితము.

ఉత్తమ హాస్యంలో చలోక్తి వినా ఖలోక్తి పనికిరాదు. సరసోక్తి వినా విరసోక్తి వినిపడరాదు. కీ.శే ఆచార్య దోణప్పగారు చెప్పినట్లు "హాస్యమన్నది కొరడాతో కొట్టినట్లుగాక కుపితనాయిక వాలు జడతో చరపు చరిచినట్లు వుండాలి. పైత్య ప్రకోపపుపోటమరింత లాగాకాక, ప్రియురాలి వెచ్చని కౌగిలింతల గిలిగింతల పులకరింతలాగా ఉండాలి!!

టెక్నాలజీ పెరిగి; ప్రపంచం చిన్న గ్రామమయి, ప్రైవేటీకరణ, అంతర్జాతీయత పెరిగినపుడు, వ్యాపారలావాదేవీలు ప్రధానమయినపుడు ప్రాథమిక సంబంధాలు తగ్గి, గౌణ సంబంధాలు పెరుగుతున్నపుడు హాస్యరసానికి ప్రాముఖ్యత తగ్గటంలో ఆశ్చర్యం లేదు. అయినా అక్కడక్కడా హాస్యసభలు కూడా నిర్వర్తిస్తున్నవారికి; హాస్యరసాన్ని పోషిస్తున్న వారికి అభినందనలు.

---

★ **కె. సింగయ్య**, రిటైర్డ్ ప్రిన్స్‌పాలు, విజయవాడలో ఉంటున్నారు.

# శ్రీనాథుఁడు - అతని మనస్తత్త్వము

– ''సరస్వతపుత్ర'', ''మహాకవి'' పుట్టపర్తి నారాయణాచార్యులు

శ్రీనాథుఁడు యద్భుతవ్యక్తి. నాటికాలమునకును కవి సార్వభౌముని భావములకును నంతగా బొత్తుగుదురలేదు. కాగా కాలమున కాతఁడే లొంగి పోవలసి వచ్చినది. కాని యాత్మస్వాతంత్ర్యము మాత్రము నివురు గప్పిన నిప్పువలె నణగియుండి, సమయము వచ్చినపుడు జ్వలించుచునే యున్నది. శైలిలో నాతఁడనేకరీతుల దనయుద్ధతండను గనపఱచెను. భావములలోఁ గూడఁ బ్రత్యేకత భాసింపకపోలేదు. ఆ మహామహునికేమి కొదువ? కావలసిన సాధన సంపత్తులన్నియు నట్టింట సమరియుండినవి. బ్రాహ్మీదత్త వరప్రసాదుఁడు. అంతేనా? బ్రహ్మాండాది మహాపురాణములఁ గబళించి యరగించు కొన్నమనిషి. శాస్త్రములలో విశంకట విహార మొనర్చినాఁడు. ఈ పాండిత్యమునకుదోడు చల్లని హృదయముగల సహృదయుఁడు. సౌందర్యమును భావింపగల తపస్వి. భావించినదాని నీలోకమునకుదించి, యంతయో యింతయో యనుభవింపవలెనను గట్టి యాసక్తియు, ఆతురతయు శ్రీనాథునకుండినవి. అందులకు దగినట్లు మనవంటి దౌర్భాగ్య జీవితముగాక, పుణ్యవశమున నెమ్మది గల జీవితము గుదిరినది. వేమభూపాలుని విద్యాధికారిత్వము, సాటివారిలో నట్లుండనీ రాజులలో మర్యాద, రాకపోకలు, స్వర్ణ పాత్రలలో విస్సనమంత్రి తోడి సహపంక్తి భోజనము, ఎక్కడ జూచినను శిష్యబృందము, పల్లకీలు, వీరవిహారము. కవిసార్వభౌముఁడు నిత్యజీవితములోఁగూడ సార్వభౌముఁడైనాఁడు. జీవితములోని తెగువ. సాహసము కవితలోనికి వ్యాపించినవి. కడుపుకొలఁది దానుదిన్నాఁడు. చేతులకొలఁది యొసగినాఁడు. నిజముగ నాతనిది మహారాజుల కాదు సులతానులమెప్పు. దమయంతీ స్తనద్వయము నాసించిన శ్రీనాథునకుఁ దృప్తిలేదు. మఱియేమి? (1) ఘుమ్మని ఘాటుగా నివతాళింపవలెను. (2) దయ్యము నెత్తికోలు సిద్ధించినఁజాలదు. తుదిదాక వలెను. ప్రతిరసమును నాతఁడిట్లే పోషించును. ''కొరత'' యనునదాతని జీవితమునకే యంటని వస్తువు. కొన్ని యెడల మన ''కబ్బా! వెక్కసమైన'' దనిపించును కాదా మఱి? అతనిది రాజభోజనము. మనవంటి క్షుద్రజీవులరగించుకొనలేరు. మఱి యజీర్ణముగాక నేమగును? కాశి ఖండములో నాతఁడు వర్ణించిన యేడ్పుఁజూడుఁడు:

''కొసరి వసంతకాలమునఁ గోయిలక్రోల్చిన భంగినేడ్చె న
బ్జసరుహ నేత్రకొండచఱి బెద్ద యెలుంగున వెక్కి వెక్కి వె
క్కసమగు మన్యువేగమునఁ గాటుక కన్నుల నీరు సోనలై
యుసిరిక కాయలంతలు పయోధరముల్ దిగువాఱు నట్లుగన్''

కన్నీరుగారినదన్న శ్రీనాథునకు దృప్తిలేదు. '' ఎట్లును నేడ్చినది; బాగుగానేడ్వని''మ్మని తలంపు. అందులకే యుసిరిక కాయలను బట్టుకొనివచ్చినాఁడు, తీరికగా! నిషధరాజు దమయంతీ సందర్శనమునకై యంతఃపురమునకుఁ బోయినపుడు, ఒక యిద్దరు ముద్దియలు ''మదగజరాజకుంభముల మచ్చరికించు'' నిండు కుండలవంటి కుచద్వయములతో నాతని నొత్తిరట! ఆ రగడలో నారాజకుమారుఁడు పాపము నదమదమైపోయినాఁడు. ఈ తెగువయే అతని శైలికిగూడ మూలము. కారకములలోని వైచిత్రి, క్రియల సొంపు, నూతనపదసృష్టి మొదలగు

నన్నిటిని గూడ నీయుద్దండతతోడనే కవిసార్వభౌముఁడు నడపెను. జీవితమున హాయియుఁ, దెగువకుఁదగిన యనుకూలములు నుండుటచే నందుకుఁబోలు గుణములన్నియు వరుసగ నీతినితో క్రందుకొన్నవి. శ్రీనాథునకు హాస్యముపై మక్కువ యెక్కువ. ఈ గుణములతోనే యాతఁడు చరమదశయందు గలిగిన యిక్కట్టు లన్నియు జీర్ణించుకొని బ్రదుకఁగలిగినాఁడు. రాయల దర్శనమునకు వెళ్ళినాఁడు గదా? ఆ దేవరాయల దర్శనమున్కై యెన్నియోదినము లొడలంతయుఁ గన్నులుగాఁ గాచుకొనినాఁడు. ఎందఱినో యాశ్రయించి, యేప్నియో తిప్పలు పడినాఁడు. నిజముగ నితరుఁడైనచో బావురుమని యేడ్చియుండును. కాని శ్రీనాథుని మనస్తత్వ మట్టిదికాదు. హాస్యమాతని కొకగుణముగగాక, వీడరాని యలవాటుడా మాఱిపోయినది. తనకుఁ దెలియనిదే యది దూఁకును. తుదకదియే 'శ్రీరామ రక్ష' యైనది. శ్రీనాథునిది స్మితముగాదు; హాస్యమునుగాదు; మఱి యట్టి హాస్యమున పాఠకులు పడిపడి నవ్వవలెనని యాతని యాశ. ఈ కోలాహలములో నాతనికి యా కాసంత దుఃఖమును, దూది పింజవలె నెగిరిపోయినది. అతఁడన్నది చూడుఁడు!

''కుల్లా యెట్టితిఁ; గోకఁజుట్టితి; మహాకూర్పాసమున్ దొడ్గితిన్,
వెల్లుల్లిన్ దిలపిష్టమున్ మెసవితిన్; విశ్వస్తవడ్డింపఁగాఁ
జల్లాయంబలిఁ ద్రావితిన్; రుచులుదోసంబంచుఁ బోనాడితిన్;
దల్లీ! కన్నడరాజ్యలక్ష్మి! దయలేదా? నేను శ్రీనాథుఁడన్.''

పాఠకులను మెప్పించుటయును చాపల్యమునకు ముందు, పుణ్యాపాప విచారముగూడ లేదతనికి. కుల్లాయించుటయుఁ, గోకఁజుట్టుటయుఁ, దుదకంబలిఁద్రావుటయు నంత పెద్ద యిక్కట్టులుగాఁ దోచలే దామహానుభావునకు. 'విశ్వస్తచేతి యన్నమును దినవలసివచ్చెనే' యనునదే పెద్ద దుఃఖమై బాధించినది. ఔరా, రాజసము! లేకున్నఁ, జేతులయందలి కంకణముల గలగలలతో, నడుమ నడుమఁ బూలబంతులవంటి కోఱచూపుల వ్రేటులతో, వాలుజడలతోఁ, గొంగుతాకులతోఁ, జల్లనియూర్పుతావుల నన్నమును జల్లార్చి యప్సరల వంటివారు వడ్డింపఁగా, బంగారు పాత్రములలో రాజభోజనమును గావించిన యదృష్టశాలి కీయష్టావక్రమూర్తులు ముందు నిలిచిన నేడుపుగాక మఱేమి గలుగును? పలనాటి కాతఁడు పోయినపుడు అచట వానలేకపోగా నీశ్వరుని గుఱించి యొక పద్య మల్లినాఁడు. అది హాస్యమో, గర్దింపో, మీరే వింగడింపుఁడు.

''సిరిగలవానికిఁ జెల్లును
దరుణులు బదియాఱువేలం దగఁబెండ్లాడన్
దిరిపెమున కిద్ద రాంఢ్రా
పరమేశా! గంగవిడుము; పార్వతిచాలున్.'

కేవలము చాటువులయందేగాక, కథా సన్నివేశమును నౌచిత్యమును గాపాడుకొనవలసిన కావ్యములలోఁ గూడ నాతండీ గుణమును విడువలేదు. నైషధమున నలవివాహవర్ణన మంతయు, మూలమున నంతగాలేకున్నను నిట్టి ఘట్టములతోనే నిండియున్నది. ఇట్టి సమయమువఁ పాఠకుల నాతఁడు లక్ష్యపెట్టఁడు. తన దారినేపడి యొడలు దెలియక పోవుచుండును. నిషధరాజ

వివాహమున నాంధ్రుడు గనుక చక్కని యావకాయ వండినారు. అది సామాన్యమైనది గాదుసుఁడీ! దానిధాటి కందఱికినీ ముక్కులలోఁ బొగలు (ఒ.230) రేగినవట! ఈ భావమాతని దృష్టికి హాస్యమేగాదు. ఇంకను తీవ్రమైనవి కొల్లగానున్నవి. హాస్యముకంటె నవహేళనవుపై సార్వభౌమునకు ప్రీతి. ఇతరులను గొంతవఱకైనఁ గుట్టవలెను. సంస్థానములలోని పండితులు నేర్చిన నేర్చుకొనుచున్న విద్యయిది. శ్రీనాథునకుఁ బ్రపంచమెుక 'తమాషా'. తాను నాయుఁడనియుఁ, బ్రపంచమంతయు నొక క్రీడారంగ మనియు భావించినవాఁ డాతఁడు. లోకమునందలి మెప్పులు కష్టనిష్ఠురములన్న నాతనికిఁ బిల్లాట. ఇతరులు తన చమత్కారముచేతను, మేధచేతను, 'బేలవడినపు' డాయన కంతులేని యానందము. చూడుడు! సర్వజ్ఞ సింగము నీని దగ్గఱకు వెళ్ళినవాఁడు:

''సర్వజ్ఞ నామధేయము
శర్వునకే రావుసింగ జనపాలునకే
యుర్విం జెల్లును నితరుని
సర్వజ్ఞుండనుట కుక్క సామజమనుటే!''

అని బ్రహ్మాండముగా బొగడినాఁడు. ఇతర ద్వేషము లాతనికిఁ గాఁ బట్టవు. గుణమగపడెనా నోరారఁబొగడును. దోషములేకున్నను, దనయభిరుచికి సరిపోకపోయెనా తనివిదీరఁదిట్టును. ఇంతకు ముందు జరిగినవన్నియు స్వప్నమువలె మఱచిపోవును సరి, వెనుకకు వచ్చినాఁడు. నిండు సభలో విద్వేషిని బొగడినాఁడని వాదువచ్చినది. బ్రతుకుపోవు పరిస్థితి యేర్పడునేమోయను భయమంటినది! ఆదర్శములకై అల్లాఁడుట నాతఁడెఱుఁగఁడు. ఇకఁగష్టమేమున్నది? అర్థమును మార్చినాఁడు. ''విరోధినిఁబొగడ లేదులే'' యను కొని, 'రెడ్డిరాజు' సంతసించినాఁడు. వాని వెకలితనమును జూచి యీతఁడు నవ్వినాఁడు! శ్రీనాథుని మనస్తత్వమట్టిది.

ముఖ్యముగ సార్వభౌమునకు శృంగారముపైఁ జాపల్యమెక్కువ. అతనికేమికొదువ? పాండిత్యము, వైభవము, చక్కని రూపము, నన్నియు నమరినవి. ''వెన్నవలెన్ గరంగు నలివేణుల'' నెందఱినో బిగికౌఁగిఁట జేర్చిన భాగ్యశాలి. అక్కడనాతఁడు ఛాందసమగు పుణ్యపాప విచారము గావింపలేదు. రసికతకును, ధార్మిక దృష్టికిని జాలాదూరమని శ్రీనాథుని తలంపు. అటులని నాస్తికుఁడునుగాఁడు. శైవాగమములన్నియు మూలమట్టముగ శోధించినాఁడు. 'బ్రాహ్మి'ని మనసార నుపాసించినవాఁడు. కాశీఖండమున నాతఁడు గావించిన మణికర్ణి కాది వర్ణనము ''లితఁడే నిజమగు భక్తుఁ'' డనిపించును కాని, శ్రీనాథుఁడు పరివర్తన శీలుఁడు. పాదరసమువంటివాఁడు. ఒకచోట నిలువఁడు. ఒక సిద్ధాంతమునే యంటియుండఁడు. ఒక దానినిఁ దుదముట్టింపఁడు. అందులకే యాతఁడు పురాణములను వదలివేసి, తన ప్రవృత్తి కనుకూలమగు ప్రబంధ రచనకుఁ బూనుకొనెను. ఈ గుణమునందు తెనాలి రామకృష్ణుఁడు సార్వభౌమునకు సరిపోలును. ఇరువురును జాలసేపొకే దానిని పరీక్షింపలేరు. ఐదు నిముషములు గడుచులోపలనే 'పురుగు దొలుచును.' కాని చూచినంత సేపును గంభీరముగఁ జూతురు. ''భగవత్సేవయా? అదియొకవైపు. భోగములా? ఇదియొకవైపు. ఈ రెంటికిని సంబంధమేలేదు. హృదయ పావిత్ర్యమా? దానిలోతును గమనించిన దెవ్వరు? మానవునికిది యొక్కటియేనా చాపల్యము? దీనిని

విడచినంతనే వైకుంఠమఱచేత నిలుచునా? ఇతరములు వదలవలసిన వెన్నిలేవు? వదలు చున్నామా? ''అసలీ విచారమంతయు నెందుకు, హాయిగ బ్రదికి, కన్నులు మూసికొనిపోక?'' అని శ్రీనాథుని యాలోచనలు. అతని జీవితమొక తుపానువంటిది. అందులో మంచి చెడ్డలన్నియుఁ గొట్టుకొని వచ్చినవి. మనకు గావలసిన వానిని వింగడించుకొనవలయునంతే! అతని నిందించినచోఁ జచ్చిన వానికి నష్టములేదు; మనకు లాభమును లేదు. బహుశః యాతనికింటఁ దన తృష్ణను దీర్చికొనుటకుఁ దగిన గృహిణి లభింపదేమో! అతని* యూహకందు సుందరాంగులెవ్వరు లభింతురు? దీనికిదోఁడు భగవంతుఁడు బహుదేశాటనమును నుదుట వ్రాసినాఁడు. పోయినచోట నంతయు ముందుకీర్తి, వెనుక తాను సన్మానములు. వివాదములు. వర్ణించుటకు స్త్రీలు దొఱకిన శ్రీనాథునకొక పండుగ. నోరార వర్ణింపవలెనని యాతనియాశ. ఆ నాలుక దురదను బోఁగొట్టుకొనుట కాతఁడనేకములు చాటువులల్లినాఁడు. అల్లిన వన్నియు నాణిముత్తెములే. సౌందర్యమును మనసార భావింపవలెను. చవులూర ననుభవింపవలెను.. ఆ రసికత కంతులేదు. శృంగారమున నాతఁడౌచిత్యమును గమనింపఁడు. ఎదిరించిన వారిని ''పోరా! నాయిష్ట'' మని గద్దించి వైచుగావుగుండె యాతనిది. ద్రాక్షారామము నందలి ''గంధర్వాప్సరో భామినీ వక్షోజద్వయ కుంభి కుంభములపైఁ'' బండుకొని, యెన్నియో వెన్నెల రాత్రులు గడపిన యసమాన రేఖశాలి. పచ్చి పొగరుట్టిపడు ''నూనూగు మీసాల నూత్నయౌవనము'' నుండియు గ్రంథ రచనమునకు దొరకొన్నాఁడు. కౌమారముననే 'శాలివాహన సప్తశతి' వంటి యుత్తమ శృంగార కావ్యములవైపు దృష్టిపాఱినది. చదివి చదివి యానందించినాఁడు. తాను గనుఁగొన్న నిగూఢార్థములను వేమారెడ్డికి సహాయ మాచరించు నెపమున దాని వ్యాఖ్యలో గుమ్మరించినాఁడు. తుదకు రసపిపాసియై, రసతపస్వియై దాని నాంధ్రీకరించినాఁడు. ఆంధ్రులమగు మన యభాగ్యవశమున నది మనకు దక్కకపోయినది. శృంగారమును లలితముగ భావించి వ్రాయు కొద్ది మందిలో శ్రీనాథుఁడొకఁడనుటకు సందేహము లేదు. అన్నిటిలో నాతనికున్న తెగువ యిందులోను గూడినది.

సార్వభౌముని రసికత గొప్పది. కాని యది పరిమితి నెఱుఁగదు. పాలకురికి సోమనాథుఁడు శైవాగములోవలెను, పోతన భక్తియందువలెను, వాల్మీకి కరుణయందువలెను, పెద్దన ప్రకృతియందువలెను, శ్రీనాథుఁడు శృంగారమున నోడలు మఱచును. అతఁడు ''ప్రౌఢనిర్భరవయః పరివాకమున'' వ్రాసిన భీమఖండమునగూడ నీగుణమే పుంజుకొని యున్నది. తక్కినవన్నియు మాఱినవిగాని, జీవధర్మమగు నిది మాత్రము మారలేదు. కాశీఖండమును దెనిఁగించినాఁడు గదా, మూలమునలేని వెన్నియో శృంగార పద్యములు గల్పించినాఁడు. కల్పించినవన్నియు, నాతని మనస్తత్త్వమున కద్దమువలె నున్నవి. శృంగారచ్ఛాయ మూలమునఁ గానఁబడిన చాలును. దానినవతలఁబెట్టి యాతఁడందుకొనును. తనివిదీఱ వర్ణించి, తనకాయాస మగునపుడు మఱలకథ నందు కొని పోవుచుండును. ఇంతగా వర్ణించును గదా! విసుగనిపించునా? వానకాలమ నందలి ప్రవాహముల యురవడివంటి యాతని కవితతో శరీరము మఱచి మనమును గొట్టుకొనిపోదుము. శృంగారమున శ్రీనాథుఁడెన్ని పోకడల నైనఁబోఁగలఁడు' గడుసుగాఁ బలుకఁగలఁడు. మృదువుగాఁ దిద్దఁగలఁడు. సర్వరీతుల నందగాఁడైన పండితుఁడు. నైషధములోని యీ పద్యమెంత రమ్యముగా నున్నది!

''తోఁకజుక్కలంబోలు దృక్తోయజముల
వెలితిలేకుండ మీబోటి చెలులఁజూచు
కాంతవీక్షింప దరకంటఁగాని మమ్ము
మేముచేసిన యపరాధ మేమి చెపుమ?''

పై యుపమానము నాతఁడెన్ని దినములనుండి జాగ్రత్తపఱచెనో! ''వెలితి'' యను పదమును కర్థము వెలితిలేకయే యున్నది. ' అరకంటం! జూడలేదనుటలో ధ్వనిగాదు గాని, చమత్కారమున్నది. '' ఏము చేసిన యపరాధమేమి'' యనుమాటఁ జక్కని వ్యవహారదక్షుఁడే వాఁడఁగలఁడు. వాఁడిన ప్రతి పదమును వాచ్యార్థమున కుపస్కారమే. తిక్కనవలెఁ బ్రతి పదమును శ్రీనాథుఁడు తూచివేయలేఁడు గాని, వాఁడినంతవఱకు నందముగనే యుండును. అతని జీవితము వంటిదే శైలిగూడ. ధ్వని యున్నను, లేకున్నను వాఁడిన పదములు పూవులవలె, కోడిపుంజులవలె విచ్చుకొని, మెడలు మలఁచికొని, జంభముగా నడుపవలయును. తాను పల్లకీలో గూర్చొని పోవునపుడు ముందు స్తుతిపాఠములు సేయుచుఁబోవు వందిమాగధులవలె, ముస్తాబై, డాబుగనడచిననే యాతని యాత్మ సంతోషించును. శ్రీనాథునకు ధ్వని దృష్టి లేదనరాదు. గాని, యంత ప్రధానము మాత్రముగాదు. ముఖ్యముగ నాతఁడు వాచ్యకవి, శబ్దార్థమెంత తీక్ష్ణముగ, గంభీరముగఁ బొట్టేలువలె నున్న నాతని కంత యానందము. ఇది లేని ధ్వనిగూడ రంజకముగాదు. పదచాపల్యమున నొక్కొకసారి కవిసార్వభౌముఁడర్థమునుగూడ విచారింపఁడు. చూడుఁడు:

''ప్రకుపితశాంకరీ చరణపంకజకుంకుమ పంకసంకర
ప్రకటనిరంకశంకర కపర్దశశాంక కళంక కారముల్'' (శృం.నై)

నిరంకుఁడగు చంద్రుఁడని తానే వాచ్యముగా నన్నాడు. కాని, ''శశాంక'' పదము వాఁడు నప్పటికా తలఁపంతరించినది. ఆ శైలిలో నుయ్యాల తూగువంటి యాదర్జా నడకలో పదప్రయోజనమును గమనించు తీరిక యెవరికని యాతని నమ్మకము. ఈ గుణమునకుఁ గారణమేమి? ఇతఁడు స్వయముగా నావేశి. చదివిన గ్రంథములుగూడ నావేశ భిక్షయే యిడినవి. పాలకురికి సోమనాథుఁడు, నాచనసోమన, నన్నయ, శ్రీనాథునకారాధ్య దేవతలు. తిక్కనను జక్కగఁ జదివినాఁడు. ఆనందపడినాఁడు. కాని యాతని ''ధ్వని దృష్టి'' మాత్రము సార్వభౌమున కంటలేదు. జీవితమున లేని మితము. వశిత్వము కవితయందు మాత్ర మెక్కడనుండి వచ్చును? పూర్వాపరముల గమనింపక పోవుట, తన యారాధ్య దేవతకు వలెనే - యాతనికి వచ్చినది. వచ్చినను 'ఫరవా' లేదు. ధ్వని లేకున్నను, వాచ్యార్థమున మఱెవ్వరికిని రాని తీక్ష్ణత క్రందుకొన్నది. దానితో నొక విశిష్టత గలిగి, యాతనికొక ప్రత్యేకస్థానమును సంపాదించి యిచ్చినది. వాచ్యమున శ్రీనాథుఁడు పోయినన్ని పోకడలు మఱెవ్వఁడును పోవఁడు - పోలేఁడు. భాషా భాండారము సమృద్ధిగాఁగల ధనవంతుఁడాతఁడు. అతనికిఁ బ్రపంచమన్నను, ప్రత్యర్థులన్నను లెక్కలేదు. యుద్ధవీరునివలె నాతని శైలి, ఱొమ్ము విఱచుకొని నడచును. దుష్కర ప్రాసములు మొదలైన యిక్కట్టులు శ్రీనాథుని బాధింపవు. పద్యము మొదలు పెట్టినచోఁ గడపటి వఱకు బాణమువలె సాగిపోవలసినదే పిలుచుటయే తడవుగఁ బదబంధము వచ్చి గుదురుకొనును. అతని వాచ్యశైలులఁ గొన్నీ చూచుఁడు:-

''జాతరూపచ్ఛ దచ్ఛటా జాతరూప
లక్ష్మి యింతొప్పునే మరాళమునకనుచు.'' (శృం.నై.)
''కాలకంఠ కఠోర కంఠహుంకారంబు
చెవులుసోకనినాఁటి చిత్తభవుఁడు.'' (శృం.నై.)
''సలిలంబు త్రిషవణ స్నాన క్షమంబొనె
యంభోజపత్ర దీర్ఘాయతాక్షి.'' (హ.వి.)

''చిగురు దామరపాకు జివ్వనఁ జనుదోయి
మొనలుగ్రొన్నేడికి ముడుగఁబాటె
తరుణరంభాగర్భదళతాళవృంతమ్ము
బైగాలిసోకిన బలుకఁబాఱె;
తరుణచక్రాంగ! పాథఃపతంగశక్ర!''

ఈక్రింది పద్యమువంటి దాతని సాధారణమగు శైలి :-

''కాలాంతఃపురకామినీ కుచతటీ కస్తూరికా సౌరభ
శ్రీలుంటాకము, చందనాచలతటశ్రీ ఖండ సంవేష్టిత
వ్యాలస్ఫార ఫణాకఠోర విషనిశ్వాసాగ్ని పాణింధమం
బేలానాపయి దక్షిణానిలము పక్షీ, చేయు దాక్షిణ్యమున్?'' (శృం. నై.)

శ్రీనాథమహాకవి మహాభిమాని. దానికిఁ బాండిత్య బలము వెన్నెముకగా నుండినది. కవిత్వమనున దాతనికి కళ మాత్రమే కాదు. ఒక కుస్తీపందెము గూడ. ప్రౌఢదేవరాయల యాస్థానమున గౌడడిండిమభట్టు గలడని తెలిసినది. ఇఁక నాతనికి నిద్రపట్టలేదు. వానిని జయించుటెట్లు? ఈ సమస్యయే ప్రబలముగ బట్టుకొన్నది. అప్పుడా మహానుభావుఁడు చెప్పిన చాటువిది:-

''కంటికి నిద్ర వచ్చునె, సుఖంబగునే రతికేళి, జిహ్వకున్
వంటకమించునే, యితర వర్తనముల్పదివేలు మానసం
బంటునె, మానుషంబుగల యట్టి మనుష్యున కెన్నఁడేనియున్
గంటకుఁడైన శాత్రవుఁడొకండు దనంతటివాఁడు గల్గినన్?''.

తుదకా డిండిమభట్టారకుని జయించి, ''పగులఁగొట్టించి తుద్భట వివాదప్రౌఢి గౌడడిండిమభట్టు కంచుఢక్క'' అని హాయిగ జెప్పికొనువఱ కాతనికిఁ దృప్తిగల్గలేదు. సార్వభౌమునికీ మనస్తత్వ ముండఁబట్టియేయాతని కాంతరంగిక శత్రువులు గొందఱేర్పడిరి. అతనికి విద్యాశాఖాధికారి పదచ్యుతి జరిగిన యనంతరము కాఁబోలు నాతని కవిత్వమును గర్ణాటభాషయని నిందించిరి. వారికి శ్రీనాథుని యుత్తరము, ఉత్తరము మాత్రమేగాక ఒక 'చపేట'మైనది. అతని యుత్తరమున నెంతటి యభిమాన ముట్టిపడుచున్నదో చూడుఁడు:-

''ప్రౌఢిఁ బలికింప సంస్కృత భాషయండ్రు
పలుకునుడికారమున నాంధ్రభాషయండ్రు

ఎవ్వరేమన్నఁగాని నాకేమి కొఱత?
నా కవిత్వంబు నిజము కర్ణాటభాష''

దీనిలో మర్యాద యున్నది. ఎదుటి వారిని కూడా గౌరవించినాఁడు; తన నిర్లక్ష్యత గనపఱచినాఁడు. '' ఎవ్వరేమన్నగాని నాకేమి కొఱత'' యనుటలో నెంతయైనను గంభీరత గలదు. అన్నియు నున్నవి గాని, తుద కదృష్టము వక్రించినది. తిక్కనవలె మితముగ మాటలాడలేఁడుగాని, మాటలాడవలెనను నిచ్చమాత్రము గలదు. ఈ పాండిత్యపు ''దొమ్మ పొగరు'' వశిత్వమును నిలువనీయ దాతనికి. తనంతఁదాను ముందు దూఁకును. ఇదియంతయు నాతని బహిరంగమూర్తి. ఇఁక నాతని యాంతరిక మనస్తత్త్వ సన్నివేశమెట్టిది? శ్రీనాథుని జీవితమునకొక యాదర్శమే లేదా? ఉండినది. అతనిది విజ్ఞాన తపస్సు. ఆ తపములో - ఆ యాదర్శములో నాతని జీవిత మాగిపోయినది. రాత్రింబగళ్ళను పరిశ్రమ జేసినాఁడు, చేసిన దానికి సంపూర్ణముగ ఫలమను భవించినాఁడు. ఆ పాండిత్యములో ఆ వైభవములో మంచి చెడ్డలన్నియు నుండినవి. తన హృదయము నొకచోట నేనియు దాచుకొనలేదు. తనయందలి గుణదోషముల నన్నియు స్పష్టముగ నెత్తి చెప్పి ''మీకు గావలసినవాని నేరుకొనుఁ''డని గుప్పి పోసినాడు. తప్పులు పట్టు వారిని గని లొట్టలువైచి, ''యెవ్వరేమన్న నాకేమి కొరత'' యని మదగజమువలె వెళ్ళిపోయినాఁడు.

శ్రీనాథునిలో మహాసరసత్వమున్నది. స్త్రీల నూరక యధిక్షేపించు వెఱ్ఱి వెంగళయ్య వేదాంతులను జూచి:

''లాలామూత్రపురీష ఘర్మజల కీలాలాత్ములౌనారు లం
చేలారోతలు పుట్టనాడెదరు యోగీంద్రుల్ వృథాలాపముల్
లాలామూత్రపురీష ఘర్మజల కీలాలాత్ములో దారటే
ప్రాలేయంబు పటీరపంక ఘనసారక్షౌద్రదివ్యాత్ములో.'' (శృం. నై.)

అని బాహాటముగ ధిక్కరించుట కాతఁడు జంకలేదు. శుష్కవాద బలముతోఁ గాలము గడుపుచుండు నైయాయికులను జూచి, ''పంకంబులోని కంబంబుతర్క'' మని వెక్కిరించినాఁడు. అతని తెగువ కంతులేదు. పొగిడిన నంతే తెగడిన నంతే!

ఇన్ని యున్నను సమయము వచ్చినపుడెక్కడలేని గొప్పతన మాతనికి వచ్చును. అపుడు శ్రీనాథుఁడొక జ్యోతిర్మయుఁడుగా తానుపాసించిన బ్రాహ్మీరూపుఁడుగాఁ గానఁబడును. అల్పులగు ప్రతివాదులు దన్నాక్షేపించినపుడు, వారితో వాదమునకుఁ బూనుకొనుటయే సరిగాదనుకొన్నాఁడు. వారి కాతఁ డొసఁగిన యుత్తరమిది.

''నికటముననుండి శ్రుతిపుట నిష్ఠురముగ
నడరి కాకులుసేరి బిట్టఱచినప్పు
డుదధిరాయంచ యూరకయుంట లెస్స
సైపరాకున్న నెందేనిఁజనుట యొప్పు''

కాని, యీ యోర్పాతనికెప్పుడో అరుదుగాఁ గలుగును. సాధారణముగ నాతని శైలి యిట్టిదే.

'' ఓర్పు కొంచెము, గర్వమభ్యున్నతంబు,
శాంతి నిప్పచ్చరంబు, మచ్చరముఘనము,
కూపమండూకములువోలెఁ గొంచెమెఱిఁగి
పండితమ్మన్యులైన వైతండికులకు'' (భీమఖండము)

అంతే ఆతఁ డొక్కరికేల భయపడును? భయపడుట కవసరమేమి? నైషధము నధిక్షేపించు చిఱుత సాహిత్యము వారిని జూచి -

''...... లేజవరాలు చెక్కు గీటిన వసవల్చు బాలకుఁడు డెంద మునన్ గరగంగ నేర్చునే?'' అన్నాఁడు. తానే రసచక్రవర్తి యన్న గర్వమాతనికి తాను మెచ్చినది లోకముఁ దప్పక మెచ్చవలె నను నంతవఱ కభిమానమున్నది. విశంకటమైన పాండిత్య ముండినది. అతని జీవితాదర్శమదే. దానిలో శ్రీనాథుఁడు - పాపము కొంచెము మత్తుఁడైనాఁడు. చేతులార నార్జించినాఁడు. అద్వితీయగౌరవము ననుభవించినాఁడు. తెగడిన వారిని బాతాళమునకుఁ ద్రొక్కినాఁడు. వలచినవారిని నెత్తిపై నిడికొన్నాడు.

జీవితమును, కవితలో నాతనికి దారిద్ర్యములేదు. తెగువ - తెగువ అతని జీవితమంతయు నిదియే. మహాభిమాని. ఆదర్శమును సాధించిన మనీషి. రాత్రింబవళ్ళడతెగక సుఖములే యనుభవించిన రేఖాశాలి. బ్రాహ్మీదయతోఁగాక స్వశక్తితో, కలముతో, జగములేలిన సార్వభౌముఁడు. వంచన నెఱుంగని మనస్వి. బృహస్పతికిఁగూడఁ దలవంచనిగర్వి. వాఙ్మయ రంగము నందాతఁడొకవీరుఁడు, అన్ని దేశములును దిరిగినాఁడు. అన్నిరుచుల ననుభవించినాఁడు. హాస్యలోలుపుఁడు శృంగార శ్రీనాథుఁడు. జగమంతయు స్త్రీమయమే, తలఁపు లన్నియు సౌందర్యమయమే కావలెనని యాతనియాశ. సార్వభౌముని నడకలో, కనుబొమ్మలో, చూపులో ప్రతిదానియందును 'రాజఠీవి'యే గలదు. శృంగారముగూడ రాజసమే. త్యాగశాలి కాకున్న, కనకాభిషేకము జరిగినపుడు పోసిన దీనారములతో యింకొకఁడైనచో పదిజన్మములు నిశ్చింతగ, సుఖముగా బ్రతికి యుండును. కాని శ్రీనాథుఁడు నిలుపుకొన్నాఁడా? అవి యన్నియు మూఁడు దినములలో వెదజల్లి, తుదకు దానుమాత్రము మిగిలినాఁడు. ముసలితనమున హాయిగా గన్నులు మూసికొని పోక, పాపము. పాపము కొద్దిగా పండినది. తనయుప్పుఁదిని, తనకు జోహారులిడిన ద్రోహులందఱును కృతఘ్నులైనారు. జీవనాధారము కష్టమైనది. యోగ్యత నాదరించి గౌరవించువారులేరు. ఇంటనన్నములేదు. కలమును పాఱవేసి హలమును జేఁబట్టినాఁడు. అదృష్టము పూర్తిగ వక్రించినది. కనుదమ్ములలోనుండి రెండు బాష్పబిందువు లభిమానమును పెకిలించుకొనివచ్చి నిలిచినవి. గర్వమాగినదా? మరణ కాలమునకూడ ''దివిజ కవివరు గుండియల్ దిగ్గురనఁగ'' నని తనకుఁదానే గౌరవము జేసికొన్నాఁడు. అంతర్నిహితమైన యభిమాన మొక్కసారి పొంగివచ్చినది.

అమరకవి యస్తమించినాఁడు! గుణదోషములచే, తేజస్తమస్సులచే, శబలితమైన యాతని జీవితమునుండి మధుర వాఙ్మయములు బయలుదేఱినవి!! మహాకవికిఁ గూడువెట్టక - బలవంతముగాఁ జంపిన మనమాతని కావ్యములు నేటికిని జదివి, లొట్టలు వైచుచున్నాము!!!

# కవిత్వంలో అనిర్వచనీయత

- బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు &

- చిరుమామిళ్ల సుబ్బారావు

కొన్ని కొన్ని పద్యాలు చదివినప్పుడు లేక విన్నప్పుడు వెంటనే మధురమైన ఒక అనుభూతిని మనం పొందుతాం. ఈపద్యం ఎంత బాగుంది! అంటాం. ఏం చెప్పాడు కవి ఆపద్యంలో? అని అడిగితే మాత్రం వెంటనే ఇదమిత్థమని స్పష్టంగా ఏమీ చెప్పలేం.

ఉదాహరణకి:

''మాట్లాడని మల్లెమొగ్గ
మాదిరిగా నడచిరా!''

అన్న పంక్తులు చదివినప్పుడు కవి ఎవరిని సంబోధిస్తున్నాడనే సందేహం మనకిరాదు. ఆ వ్యక్తిని 'మాట్లాడని మల్లెమొగ్గ' అని ఎందుకంటున్నాడు అనే జిజ్ఞాసా మనకు కలగదు. పద్యం మాత్రం బాగుంది అనిపిస్తుంది. ఏదో పర్యుత్సుకత మనకు కలుగుతుంది. అలాగే-

' ఎవరో ఆకలిని ఆరవేశారు'

అనే పంక్తిచదివినప్పుడు ఒళ్లు ఝల్లుమంటుంది. మన సాంప్రదాయిక కవిత్వంలో ఎక్కువ భాగం చదివేటప్పుడు మనం అడిగే ప్రశ్నల్లాంటివి ఇలాంటి పద్యాలు చదివినప్పుడు మనకు తోచవు.

నిజమైన కవిత్వం అంతా మాటల్లో చెప్పడానికి వీలులేని అను భూతిని మాటలమధ్య ఇమడ్చడానికిచేసే ప్రయత్నమే అనవచ్చు. ఈ భావాన్నే ఆంగ్లకవి టి. ఎస్. ఇలియట్ - "A Continual raid on the inarticulate' (అనిర్వాచ్యమైన తత్త్వంమీద కవి నిరంతరంగా జరిపే దాడి కవిత్వం) అంటాడు. కవిత్వంలో అర్థం అనేది దోపిడిదొంగ వచ్చి 'మనస్సు' అనే కావలికుక్కకునోరెత్తకుండాపడిఉండడానికైపడవేసేరొట్టెముక్కలాంటిదిమాత్రమే(Meaning is only a meat to the house - dog of the intellect) అని, అర్థానికి కవిత్వంలో అప్రాధాన్యాన్ని సూచిస్తాడు ఇలియట్- మరొకచోట. అర్థం అవడానికి ముందే అనుభూతమయేది కావ్యం. పాఠకుడి నాడీమండలానికి విందు చెయ్యాలి కావ్యం ముఖ్యంగా - ఆయనదృష్టిలో.

'అనిర్వచనీయత' అనేభావం మరింత విశదంగా బోధపడడానికి ఒక ఇంగ్లీషు పద్యం పరిశీలిద్దాం:

"Batter my heart, three person'd God; for, you
As yet but knock, breathe, shine, and seek to mend;
That I may rise, and stand, O'erthrow me, and bend
Your force, to break, blow, burn and make me new.
I, like an usurpt town, to another due,
Labour to admit you, but oh, to no end,

Reason your viceroy in me, me should defend,
But is captiv'd, and proves weak or untrue.

Yet dearly I love you, and would be loved fain,
But am betroth'd unto your enemy
Divorce me, untie, or break that knot again,
That me to you, imprison me, for I
Except you enthrall me, never shall be free,
Nor ever chaste, except you ravish me.

*- John Donne.*

ఈ గుండెని పగులగొట్టెయ్ త్రిమూర్త్యాత్మకా: భగవన్
మెల్లిగా తట్టి, గుసగుసలాడి, మెరిపించి నువు నన్ను మార్చలేవు
నిట్టనిలువున కూల్చివెయ్యి, నీ శక్తి అంతాచూపి నుగ్గునూచంచెయ్యి
ఆపాదమస్తకం దహించివెయ్యి మళ్లీ కొత్తమనిషిని చెయ్యి
అన్యాక్రాంతనగరిలా అన్యాధీనంలో ఉన్న నేను
నీకు స్వాగతం చెప్పడానికి అశక్తుణ్ణి!
నాలో నీ వైస్రాయి 'బుద్ధి' నన్నే నిజానికి సమర్థించాలి
కాని శక్తిరహితం, బందీ ఆ 'బుద్ధి' - కాకపోతే విద్రోహి!
ఇప్పటికీ గాఢంగా నిన్నే ప్రేమిస్తున్నాను - నీ ప్రేమ నర్థిస్తున్నాను
అయితే నీ విరోధితో నా వివాహం స్థిరపడి పోయింది
సంబంధం చెడగొట్టెయ్, ముడివిప్పెయ్, లేదా త్రెంచెయ్
నీలోకి నన్ను తీసుకో, నీ బందీగా చేసుకో
నన్ను నువ్వాక్రమిస్తే తప్ప నాకు స్వేచ్ఛ లభించదు.
నన్ను నువ్వు చెరిస్తే తప్ప నాకు విశుద్ధికలుగదు.

పాపభూయిష్ఠమైన ఐహిక జీవితంమీద ఏవగింపుతో తనను తాను భగవంతునికి ఆత్మార్పణ చేసుకుంటూ కవి వ్రాసిన పద్యం ఇది. ఇంచుమించు ఇదేభావంతో ఉన్న ఎన్నో పద్యాలు మనం చదవవచ్చు. కాని వాటన్నిటినుంచీ దీన్ని వేరుచేసి చూపే లక్షణం ఒకటి ఉంది దీనిలో. అది పద్యబాహ్యార్థంలో కంటె పద్యనిర్మాణ రీతిలోను, పదాల ఎన్నిక, అనుక్రమణిక, చివరికి విరామచిహ్నాలలోనూ ఎక్కువగా ఇమిడి ఉంది. ఇదే కావ్యశక్తి. మన నాడీ మండలాన్ని కదిలించేదీ, పద్యభావాన్ని అపరిమేయం చేసేదీ ఈశక్తి! "break, blow, burn" వంటి ఏ కాక్షర పదాలు

వరుసగా వాడడంలోనూ, 'బ' కార పునరావృత్తిలోనూ, మొత్తం పద్యగమనంలోనూ తీవ్రమైన ప్రాకృతికరతి సంరంభాన్ని నిగూఢంగా, నిపుణంగా కవి స్ఫురింపచేస్తాడు. "Nor ever chaste except you ravish me' అనే పద్యం చివరిపంక్తి చదివినప్పుడు ఈ భావం మనకు మరింత స్పష్టమవుతుంది. అయితే పద్యగమకం వల్ల మనకు కలిగే అనుభూతి అంతా ఇదే అనడానికీ వీల్లేదు. దానిలో ఇది ఒక అంశం మాత్రమే! పద్యం అంతా శక్తి సంకీర్ణరూపం. ఆశక్తి అంతా ఇదే అని సంపూర్ణంగా వివరించగలగడం ఎవ్వరికీ సాధ్యంకాదు. అది కేవల అనుభవైకవేద్యం. ఈ అనిర్వచనీయతా లక్షణమే కావ్యానికి అపరిమేయతను, నిత్యతనూ సమకూరుస్తుంది.

అనిర్వచనీయతా లక్షణం గల పద్యాలు ప్రాచీన భారతీయ సాహిత్యంలో కూడా అక్కడక్కడ మనకు కనిపించకపోవు. ఉదాహరణకు కాళిదాసకవి అభిజ్ఞానశాకుంతలంలోని ఈ క్రింది శ్లోకం చూడవచ్చు:

రమ్యాణి వీక్ష్య మధురాంశ్చ నిశమ్య శబ్దాన్
పర్యుత్సుకో భవతి యత్సుఖితోఽపి జంతుః।
తచ్చేతసా స్మరతి నూన మబోధపూర్వమ్
భావస్థిరాణి జననాంతర సౌహృదాని॥

దుర్వాసుని శాపంవల్ల శకుంతలతో తన ప్రణయ వృత్తాంతం మరచిపోతాడు. ఆమెను నిరాకరించి పంపివేస్తాడు. ఒక సాయంత్రం హంసపదిక అనే అంతఃపుర స్త్రీ పాడుతున్న ఒక గీతం ఆయన చెవిని పడుతుంది. ఆగీతం భావం - '' ఓతుమ్మెదా! అప్పుడు అంతగా చూతమంజరిని పరిచుంబించిన నీవు క్రొత్తమధువుమీది కోరికతో ఆమెను మరచి ఇప్పుడు కమలవసతిమాత్ర సంతృప్తుడవై ఆనందిస్తున్నావు'' అని. ఈ అన్యాపదేశ గీతం మహారాజునకు వినపడాలనే గొంతెత్తి పాడుతుంది హంసపదిక. ఆమె ఒకప్పుడు ప్రభువు అనురాగానికి పాత్రురాలైన స్త్రీ. ఆగీతం విని దుష్యంతుడు పర్యుత్సుకత పొందుతాడు. పర్యుత్సుకత అంటే నాడీ మండలంలో సంచలనం అనవచ్చు. చీకూచింతా లేకుండా సుఖంగా ఉన్న తనకు ఆగీతం వినగానే సంచలనం ఎందుకు కలగాలి అని ప్రశ్నించుకొని దానికిలా ఆయన జవాబు చెప్పుకుంటాడు. అందమైన వస్తువుల్ని చూసినప్పుడు, మధురమైన శబ్దం విన్నప్పుడు మనకు తెలియని ఏవో సంగతులు మనకు జ్ఞాపకం వస్తాయి. జననాంతరాల సౌహృదాలను, ప్రణయాలను - మన మనస్సులోతుల్లో పేరుకొని సుస్థిరంగా ఉన్నవాటిని - ఇవి జ్ఞాపకం చేస్తాయి. శకుంతలా ప్రణయం దుష్యంతుడికి - పాపం జననాంతర సౌహృదమే అయింది, దుర్వాసునిశాపంవల్ల. ఆ గీతం ఆవృత్తాంతాన్ని స్మరింపజేస్తోందని అతనికి తెలియదు; నాటకం చూసే సామాజికులకు మాత్రం తెలుసు.

పై ఆంగ్ల పద్యంలో లాగ రచనా నిర్మాణం కాక పద్యబాహ్యార్థం అనంతంగా ప్రతిధ్వనులను కలిగిస్తూ పద్యభావాన్ని అనిర్వచనీయం, అపరిమేయం చేస్తూ ఉండడం ఈ శ్లోకంలో విశేషం.

స్పష్టంగా అర్థం చెప్పడానికి వీల్లేకపోవడం చెడ్డకావ్యానికే లక్షణం అని భావించేవాళ్లు ప్రపంచంలో అన్ని దేశాల్లోనూ కనిపిస్తారు. లండన్‌లో 1955 మార్చి 11న బెట్జిమన్ అనే కవికి పౌ 250 ల చెక్ ఇచ్చి సత్కరిస్తున్న ఒక విందులో ప్రధానాతిథిగా వచ్చిన లార్డ్ శామ్యూల్ ఇలా అన్నాడు - ''ఇటీవల

వచ్చిన చాలా కవితా సంకలనాలు చదివి చూశాను. అస్పష్టత అనే దౌర్భాగ్యలక్షణం ఇంగ్లీషు కవిత్వంలోకి ఎంత ఎక్కువగా ప్రాకిందో చూస్తే నాకు విచారం కలుగుతూంది. వందలకొద్దీ అలాంటి ఉదాహరణలు చూపించగలను. కాని ఇక్కడ ఒకే పద్యం చదువుతాను...'' అని సుప్రసిద్ధాంగ్లకవి డైలాన్ థామస్ వ్రాసిన "A grief ago..." అనే పద్యం చదివాడు. ఆయన ప్రసంగం ముగిసిన తరువాత సమ్మానం స్వీకరించిన కవి సమాధానం చెబుతూ లార్డ్ శామ్యూల్ చదివిన ఆ పద్యం ఏ కవి వ్రాసిందో తనకు తెలియదన్నాడు. ఆ సభలో ఉన్న మరో ప్రసిద్ధాంగ్లకవి స్టీఫెన్ స్పెన్డర్ కోపంతో మధ్యలో డైలాన్‌థామస్ వ్రాసిన పద్యం ఉదాహరించడం మొదలు పెట్టగానే సభలోనుంచి లేచిపోయాడు. తరువాత ఆయన అన్నాడట -'సభలో ఎవరైనా లార్డ్ శామ్యూల్‌ను కోడిగ్రుడ్లు పెట్టి కొట్టి ఉంటే బాగుండేది' అని. ''డైలాన్‌థామస్ పద్యంలో కొన్ని భాగాలు అర్థంకానివి ఉంటే ఉండవచ్చుగాక! తిరిగి తిరిగి మన మనస్సును వెంటాడేమాటలు ఎన్ని అంటాడు అతను?'' అని కూడా స్పెన్డర్ అన్నాడట.

సాహిత్య విమర్శకులలో కావ్యంలో అస్పష్టత ఎంతమాత్రం పనికిరాదనే వాళ్ళూ ఉన్నారు; అన్ని అత్యుత్తమ కావ్యాల్లోనూ అస్పష్టాంశం, అనిర్వచనీయాంశం ఉండితీరుతుందనే వాళ్ళూ ఉన్నారు. కావ్యాల్లో అస్పష్టత అసలు ఎందుకు వస్తూంది? ఇటీవలి కావ్యాల్లోనే అస్పష్టత తలయెత్తిందా లేక ప్రాచీనకాలంనుంచీ ఇది వస్తూనే ఉందా? అన్నిరకాల అస్పష్టతా కవిత్వంలో పరిహరించదగిందేనా? ఇటువంటి సూక్ష్మ ప్రశ్నలనుగూర్చి జాన్‌వ్రెస్ వంటి ఆంగ్ల విమర్శకులు సునిశితమైన పరిశీలన జరిపారు.

పద్యం అర్థంకాక పోవడానికి అనేక కారణాలుండవచ్చు. చదివేవాడికి పరిచితం కానీ మారుమూల పదజాలం. వాక్యవిన్యాసం ఒక్కొక్కప్పుడు పద్యాన్ని దుర్గ్రాహ్యంచేయవచ్చు. లేక కవి ఆలోచనా ధోరణి పాఠకజన సామాన్యంకాని ఒక విలక్షణ మార్గాన్ననుసరించడం వల్లా పద్యం తికమక పెట్టవచ్చు. నూతన సామాజికపు విలువలను కవి పాటించడం వల్ల ఆవిలువలతో పరిచయంలేని పఠితకు పద్యం ఒక్కొక్కప్పుడు కొరుకుడు పడక పోవచ్చు. కవి ఉదాత్తతకు తగిన స్థాయిలో పాఠకుల సంస్కారం లేకపోవడమూ వారికి ఆకావ్యం అస్పష్టం అని పించడానికి కారణం కావచ్చు. దేశ కాల పరిస్థితులను గమనించకుండా కవి తన సంకుచిత స్వర్గంలో తాను కూర్చొని కావ్యాలు వ్రాసుకుపోతూ ఉంటే అలాంటి కావ్యాలు పాఠకులకు అర్థరహితంగా తోచవచ్చు. దేశంలోవస్తున్న పరిణామాలను కవి స్పందించినంత సూక్ష్మంగా సంఘం స్పందించలేకపోవడంవల్ల కూడా ఒక్కొక్కప్పుడు ఆ పద్యాలను అస్పష్టతాదుష్టాలు అని త్రోసివేయడం జరగవచ్చు. పూర్తిగా వ్యక్తిగత సంకేతాలు ఎక్కువకావడం, వ్యక్తిగతమైన వింత అనుభూతులను ప్రకటించడం మరొక్కొక్కప్పుడు కావ్యాన్ని అర్థరహితం చేయవచ్చు.

ఒకటిఁగొని రెంటినిశ్చలయుక్తిఁజేర్చి
మూఁటి నాల్గింటఁ గడు వశ్యములుగఁజేసి
యేనిటిని గెల్చి యాఱింటివిెఱిఁగి యేడు
విడిచి వర్తించువాఁడు వివేకధనుఁడు. ( ఉద్యోగపద్యము 2-37)

ఇటువంటి పద్యాలలో అస్పష్టత ఆ సంకేతాల అర్థం బోధపడక పోవడంవల్ల వచ్చే అస్పష్టత.

ఇలాంటి అస్పష్టత కాదు కావ్యానికి అనిర్వచనీయతా లక్షణం సమకూరుస్తుందని నేనంటున్నది.

తెలుగులో 'భావకవిత్వం' మీద చెలరేగిన గాలిదుమారంలో ముఖ్యంగా వినవచ్చిన విమర్శ ఆ కావ్యాల అర్థం బోధపడదని. భావ కవిత్వోద్యమ ప్రధాననాయకుడు శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి ఆ విమర్శకు జవాబుచెప్పాడు. కవిత్వంలో అస్పష్టత అభిలషించ దగిన లక్షణమే అంటూ-

... ... ... ఎదియొ అపూర్వ మధుర
రక్తి స్ఫురియించు గాని అర్థమ్ముకాని
భావ గీతమ్ము లవి ....... ...... .....

అన్నాడు ఆయన. అర్థం కాకపోయినా అనుభూతిని చదివిన వెంటనే పాఠకుడికి అందించి కదిలించగల లక్షణం ఏదో ఆకావ్యాల్లో ఉండడం వల్లే ఆకవులూ, కావ్యాలూ కొన్నేళ్లపాటయినా ప్రజాదరణ చూరగొనగలగడం జరిగింది.

భావకవిత్వానికి ప్రతినిధికావ్యంగా శ్రీ కృష్ణశాస్త్రి వ్రాసిన ఈ క్రిందిగీతం మనం పరిశీలించ వచ్చు-

ఎవరోహో! ఈ నిశీథి నెగసి నీడవోలె నిలిచి
పిలుతురెవరో, మూగకనులు మోయలేని చూపులతో
ఎవరోహో! ఎవరోహో!

ఇపుడా నను బలుకరింతురు!
మోయలేని నీరవగళమున జలించు కోరికతో
ఇపుడా నను బలుకరింతురు

ఎవరని ఈరేయి నిదుర హృదయ మదర, వేయి చేయి
చాయలాడ పెనుచీకటి సైగలతో నా కన్నుల
రక్తమురల లాగికొందురు!

ఎవరో, నా హృదయనాళ మేలా తునియలుగా నా
నిర్జీవపు జీవితమ్మునిట వదలుదురా!
ఎవరోహో! ఎవరోహో!

ఇపుడా నను పలుకరింతురు? ('ప్రవాసము' -పుట 106)

'నిశీథి' దేనికి సంకేతమో 'పిలుపు' అంతరార్థం ఏమిటో ఈ గీతంలో స్పష్టంగా బోధపడవు. కాని, గీతం చదవగానే, లేక వినగానే ఒక నిరాశోపహతుడికి హఠాత్తుగా ఆశాకిరణంగోచరించినప్పుడు కలిగే తీవ్రమైన అనుభూతి పాఠకుడిని జిమ్మున ముసురుకుంటుంది. ఆ దృష్ట్యా ఈ గీతం అని[illegible]య మనోహరం అనవచ్చు.

ప్రతికవి వ్యక్తిత్వంలోను రెండు అంతస్తులు మనం గుర్తించవచ్చు. ఒకటి 'తన' తనము. రెండవది తదతీతంగా సర్వమానవ సమానమైన అంశం. మొదటి అంతస్తులోనే ఉంటూ రెండో అంతస్తును అందుకోవాలను తహతహయే చాలామంది కవులలో మనకు కనిపిస్తుంది. అలాంటి కవుల రచనలలో కూడా వారి అనుభూతితీవ్రత వల్ల అనిర్వచనీయతా లక్షణం గోచరించవచ్చు గాని రెండవ అంతస్తును అందుకొన్న కవుల రచనలలోని అపరిమేయతా అనిర్వచనీయత లంత హృదయంగమంగా అది ఉండదు. అందుకే 'మాట్లాడని మల్లెమొగ్గ....', ' ఎవరోహో....' వంటి పద్యాలు 'జాన్‌డన్' పద్యం లాగా, కాళిదాసు శ్లోకం లాగా మనల్ని శాశ్వతంగా వశం చేసుకోలేవు.

పద్యం అర్థం కాకపోవడం అనేది చాలా సందర్భాలలో చెడ్డ లక్షణమే కావచ్చుగాని కావ్యం అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినట్టు ఉండాలని అభిలషించడం మాత్రం హర్షించదగిన లక్షణం అనలేం. సాహిత్య విమర్శ సందర్భంలో కాకపోయినా, హెన్లీ హెన్సర్ అనే మతాధిపతి ఒకసారి-

"I have little sympathy with this lust for intelligibility' (సుగ్రాహత అంటే పడిచచ్చేవారితో నేను ఎంతమాత్రం ఏకీభవించలేను.)

అంటాడు.

సాహిత్యం విషయంలో మాత్రం "lust of intelligibility' అక్షరాలా గర్హించదగినదే! మానవుడిలోని అనిర్వచనీయ తత్త్వంలోకి ఎంతో కొంత క్రుంకులిడడానికి మనం సిద్ధపడితే తప్ప ఉత్తమసాహిత్యం చదివే అర్హత మనకు కలుగదు.

---


## HUMANISM FOR HUMAN DEVELOPMENT AND HAPPINESS

## 14TH IHEU WORLD CONGRESS

Sunday 10 January 1999 - Thursday 14 January 1999, Bombay, India

The IHEU is pleased to announce its next World Congress to be held in Bombay (new name Mumbai), India, at the M.N. Roy Human Development Campus, the World's largest Humanist Campus.

Humanism is an ancient tradition in India and humanism groups are flourishing in the Indian sub-continent, involved in a variety of practical and intellectual work.

Congress registrants will have ample opportunities to see Humanism at work; to exchange ideas with leading thinkers and activists from many countries and to take part in cultural and social programmes.

Concessions to previous IHEU Congress participants and special registration rates for participants from the Third World are available

Congress dates make it possible to take advantage of good weather and off-peak airline fares.

Advance Registration is highly recommended. For Regi stration, accommodation possibilities and other travel arrangements in connection with the Congress, write to:

**Dr. Indumati Parikh,** *President*, India Radical Humanist Association, 276, Telang Road, Mumbai - 400 019 India, Tel : + 91 22 41 41 702, Fax : + 91 22 41 35 248, E Mail : mrcssc@bom2.vsnl.net.in

# మనిషిని కాపాడుకుందాం

–డా. దేవరాజు మహారాజు

బాధ్యతగల కవులు, రచయితలు, శాస్త్రవేత్తలు, ఆర్థికవేత్తలు, అధికారులు సమాజంలోని అన్ని రంగాల వారు పూనుకుని వారి వారి కోణంలోంచి మనిషి మనుగడకు దోహదం చేయవల్సి ఉంది. దృక్పథాలు వేరైనందు వల్ల ఏర్పడే పలుచని పొరలేవైనా ఉంటే, వాటిని విస్మరించి, ఈ విషయంలో అందరూ ఏకం కావల్సి ఉంది.

విలువల వలువలు కనబడక పోవడం అన్నది ఇప్పుడు మాత్రమే జరిగిన విషయం కాదు. అది భారత కాలం నుండి ఉంది. అంతకు ముందు నుండి కూడా ఉంది. పాంచాలి వలువల్ని విప్పే ప్రయత్నం దుశ్శాసనుడు చేయనే చేశాడు. అందుకు శిక్షకూడా అనుభవించాడు. అందువల్ల ఈ పోరాటం లోగడ జరిగింది. ఇప్పుడు జరుగుతోంది. ఇకముందు జరుగుతూనే ఉంటుంది. ఈ యుద్ధానికి అంతం లేదు. కష్టసాధ్యమైనా చెడుపై మంచికి గెలుపు ఖాయం! అనే భావం తోనే ఆశాజీవి అయిన మనిషి బతుకుతున్నాడు.

అయితే ఈ యుద్ధం నిరంతరం కొనసాగించడానికి ఇప్పుడు నిజంగానే మనిషిని బతికించుకోవాల్సిన అత్యవసర సమయం ఆసన్నమైంది. ఒక వైపు పొంచి వున్న అణుయుద్ధం, మరోవైపు కాలుష్యం, ఇంకోవైపు మానవ నీచ ప్రవృత్తి ఇవి మూడూ మూడు వైపుల నుండి దండెత్తి, మనిషిని ఒక మూలకు నొక్కి పెడుతున్నాయి. మనసును ముక్కలు చేస్తున్నాయి. ఇది ఇలాగే కొనసాగితే జురాసిక్ యుగంలో రాజ్యమేలి, నశింపు పొందిన డైనోసార్స్‌లాగా ఈ శతాబ్దపు అంతానికి మనిషి నశించి పోయే ప్రమాదం లేక పోలేదు.

మనిషి భౌతికంగా సజీవుడై వుంటేనే విలువలు ప్రతిష్టించగలిగేది. ప్రేమాభిమానాలు, ఆత్మీయతలు పంచుకోగలిగేది. మనిషి ప్రకృతిని పరిరక్షించుకోగలిగితేనే, తనను తాను రక్షించుకోగలిగేది. మనిషితనను తాను రక్షించుకోగలిగితేనే, మనిషితనలోని చెడుపై తిరుగుబాటు చేయగలిగేది. సమాజం లోని చెడుపై ధ్వజమెత్తగలిగేది.

అందువల్ల మానవులందరూ అన్నిరకాలుగా మనిషిని బ్రతికించుకునే ప్రయత్నాలు చేస్తూనే ఉండాలి. అది తిరుగుబాట్ల ద్వారానే కావొచ్చు, ఆధ్యాత్మిక చింతన ద్వారానే కావొచ్చు, కళల ద్వారానే కావొచ్చు, సాహిత్యం ద్వారానే కావొచ్చు, మరింకో మార్గం ద్వారానైనా కావొచ్చు. కాని, వైజ్ఞానిక దృక్పథం వాటిలో అంతస్సూత్రంగా భాసించాలి - తప్పదు!

**సుప్రభాతం ఏజెంట్లందరి దగ్గర**
**జనవరి నుంచి 'మిసిమి' లభిస్తుంది.**

# ప్రజా విదూషకుడి క్రోధం

**- యస్. ఎ. మహమ్మద్**

ఈ ఏటి నోబెల్ సాహిత్య పురస్కారం ఇటలీకి చెందిన వివాదాస్పద హాస్య, వ్యంగ్య నాటక రచయిత, నటుడు అయిన డెరియో ఫోకు లభించింది. ఫోకు ఈ పురస్కారం లభించడం కొందరికి ఆశ్చర్యాన్ని కలిగించింది. ''అభ్యంతర కర రచనలు చేసిన వ్యక్తికి ఈ పురస్కారాన్ని ఇవ్వడం ఊహకందని విషయం'' అని వాటికన్ సంభ్రమాన్ని ప్రకటించింది. కాని సర్వసమానత్వాలను, మానవత్వాన్ని, మంచికళను అభిలషించే వారంతా ఫో కు ఈ పురస్కారం లభించడాన్ని హర్షిస్తారు.

ఫో అసాధారణ వ్యక్తి, సాహసి, నిరంతర అసమ్మతి వాది. సమకాలీన సమాజపు స్థితిగతుల వ్యాఖ్యాత, విమర్శకుడు. అన్యాయాన్ని, దమన నీతిని, అణచి వేతలను ఎదుర్కొనడంలోనే ఆయన జీవితమంతా గడిచింది. నాలుగు దశాబ్దాలుగా అవిశ్రాంతంగా ఫో, ఐరోపా అధికారా పీఠాలవైపు వేలెత్తిచూపుతునే ఉన్నాడు. ఇందుకు ఈయన ఎన్నుకున్న మార్గం హాస్యం, అధిక్షేపం. సాంప్రదాయ నాటకరంగాన్ని వదిలి వీధినాటకాలను ఎన్నుకున్నాడు. ఇటలీ జీవితపు భయానక స్థితిగతులకు ఫో నాటకాలు నిలువుటద్దాలు. ఫో నాటక రచయితే కాక గొప్ప నటుడు. తను రచించిన అనేక నాటకాల్లో ఆయనే ముఖ్యపాత్ర ధరించాడు. ఇటలీలో నటుడిగానే ఆయన అత్యంత ప్రసిద్ధుడు. తాను రచించిన దాదాపు 70 నాటకాల్లో రాజీపడకుండా, అతి నిశితంగా సమకాలీన సమాజాన్ని, ప్రభుత్వ కర్కశ విధానాలను వ్యతిరేకించాడు, అవహేళన చేసాడు, విమర్శించాడు.

ఈ పురస్కారాన్నిస్తూ, స్వీడిష్ అకాడమీ అన్నమాటలు ఫో ప్రత్యేకతను చూపిస్తాయి. ''మరే ఇతర సమకాలీన రచయిత చేయలేని విధంగా ఫో, ప్రపంచ వ్యాప్తంగా ప్రదర్శనలనిచ్చాడు. విదూషకుడు అన్న పదానికి ఫో ఖచ్చితమైన ఉదాహరణ. హాస్యాన్ని గంభీరమైన విషయాలతో జత చేసి సంఘంలోని దురాగతాలు దురన్యాయాల పట్ల మన కళ్లు తెరిపిస్తాడు. ఒక విశాల చారిత్రక నేపథ్యంలో వాటి స్థానాన్ని మనకు చూపిస్తాడు''.

అధికారాన్ని దుయ్యబట్టి బలహీనుల అసహాయుల గౌరవ మర్యాదలను నిలబెట్టే వకల్తా పుచ్చుకోవడంలో ఫో మధ్య యుగపు విదూషకులను అనుకరిస్తాడు. అనుకరణలో గొప్ప నైపుణ్యాం సాధించాడు. కథ చెప్పడంలో దిట్ట. హాస్యం మరుగున అధికారం పై చురకలేస్తాడు. బహుమతి ప్రకటనాంతరం విలేఖరుల సమావేశంలో ఫో అన్న మాటలివి. '' ఒక విదూషకుడికి కిరీటం తొడిగారు. అయితే ఎందురు విదూషకుల నోళ్ళు మూయించారో మనం విస్మరించకూడదు''. తన బహుమతిని ''అన్యాయాన్ని హాస్యంతో, అధిక్షేపంతో ఎదుర్కొన్న నటులకు'' ''చక్రవర్తికి దుస్తుల్లేవు'' అని చెప్పే సాహసాన్ని ప్రదర్శించిన వాళ్ళకు అంకితం చేసాడు. ''నాటకం ప్రేక్షకులకు నవ్వు తెప్పించే ఒకసాధనం. ఆ నవ్వులో క్రోధావశేషాలు కన్పిస్తాయి'' అని ఫో ఒక సందర్భంలో అన్నాడు. ఫో నాటకం చూస్తున్నంత సేపు ప్రేక్షకుడు బలమైన కుదుపులకు లోనై లోతుగా,

---

★ **యస్.ఎ. మహమ్మద్** గుంటూరులో సెంట్రల్ స్కూలులో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు.

విమర్శనాత్మకంగా ఆలోచించేందుకుద్యుక్తుడేతాడు. ఫో పుట్టి పెరిగింది మత్స్యకారులు, గాజు పనివాళ్ళు, స్మగ్లర్ల మధ్య. ప్రజా కళారూపాల పట్ల మమకారం ఫో కు ఈ వాతావరణంలోనే సంక్రమించింది. ''వీళ్ళు చెప్పిన కథల్లో అధికారుల, మధ్య తరగతి ప్రజల కాపట్యంపై విసుర్లు, ఉపాధ్యాయులు, లాయర్లు, రాజకీయ నాయకుల నిజస్వరూపాలు బహిర్గతమౌతాయి''. అని ఫో అంటాడు.

వాస్తవానికి, ఆదర్శానికి వారధి నిర్మించడంలో ఫో సఫలీకృతుడయ్యాడు. ఏమాత్రం పొంతన లేని రాజకీయ రంగాన్ని హాస్య రంగంతో, సమకాలీన విషయాలను సాంప్రదాయ కళారూపాలతో అనుసంధానం చేస్తాడు. ''ప్రేక్షకుల్లో చైతన్యం కలిగించి, తను చుట్టూ ఏం జరుగుతుందో గమనించే స్పృహ నందించి సమాజానికి దర్పణం పట్టాలన్నదే మా నాటక సంస్థ ముఖ్యోద్దేశం'' అని ఫో ప్రకటించాడు.

ఈయన సతీమణి 'రామ్' కూడ గొప్ప రచయిత్రి, నటి. వీరిరువురు కలసి ఎన్నో రచనలు చేసారు. తమకు ఉత్తేజం తమ వ్యక్తిగత రాజకీయ సిద్ధాంతాల పట్ల ఉన్న ధృడ విశ్వాసం నుండే కలుగుతుందని వీరు విశ్వసిస్తారు. ''మేము మా రాజకీయ సిద్ధాంతాలతో మమేకం చెందడం అంటే మా ప్రజాస్వామిక వామపక్ష భావాలతో, శ్రామిక, పీడిత వర్గాలపట్ల సానుభూతి చూపడమే. వారి అసాధారణ పోరాటాల వల్లే మా అవగాహన పెరిగింది. వారి సేవలో మేంచేయగలిగింది వారి పక్షాన నిలవడమే''. ఫో బలమైన రాజకీయ విశ్వాసాలు శత్రువులను, మిత్రులను సమకూర్చి పెట్టాయి.

ప్రపంచ వ్యాప్తంగా భిన్న ప్రాంతాల్లో, భిన్న భాషల్లో ప్రదర్శించబడి విశేష జనాదరణను పొందడం ఫో నాటకాల విశ్వజనీనతకు నిదర్శనం. ఐతే ఇందుకు మూల్యం చెల్లించక తప్పలేదు. ఈయన నాటకాలు ప్రదర్శించిన అనేక మంది నటుల ఆయా దేశాల్లో ప్రభుత్వ నిర్బంధాలకు, శిక్షలకు గురయ్యారు. ఫో స్వయంగా లెక్కలేనన్ని సార్లు నిర్బంధించ బడ్డాడు. అనేక కోర్టు కేసుల్లో చిక్కుకున్నాడు. ఈయన భార్యను ఫాసిస్ట్ మూకలు కిడ్నాప్ చేసాయి. ఈ దంపతులను రక్తసిక్తగాయాలతో ఇటలీ వీధుల్లో తరిమి కొట్టారు. ఐనా వీరు భయపడలేదు. కఠిన పరిస్థితుల్లో నిర్బంధించ బడిన ఖైదీల సహాయార్థం వీళ్ళు 'రెడ్ ఎయిడ్' అనే సంస్థను స్థాపించారు. ఈ కారణంగా అమెరికా ప్రభుత్వం వీరికి వీసా నిరాకరించింది. తమ నాటకాల రిహార్సల్సును పర్యవేక్షించేందుకు నిరాకరించడం వల్ల పోలీసులు 'ఫో'ను ఒక పద్ధతి ప్రకారం వేధించారు. ఫో విమర్శించేది ఒక దేశ ప్రభుత్వాన్ని, అధికారాన్ని కాదు. ''నేనెప్పుడు అధికారాన్ని తమహస్తాల్లో ఉంచుకున్న వాళ్ళను, వారు ఏ దేశస్థులైనా సరే, విమర్శిస్తాను'' అన్నాడు.

'ఫో' నాటకం ''మిస్టర్ బఫో'' ఇటాలియనుల మతభావాలను అపవిత్రం చేసిందని పోప్ అభిప్రాయ పడ్డారు. 'టెలివిజన్ చరిత్రలోనే అత్యంత అపవిత్రమైనది'గా అది వర్ణించబడింది. కారణం ఇందులో మతాచార్యుల ఛాందసాన్ని దుయ్యబట్టి వారి నైతికతను ప్రశ్నిస్తాడు పోప్. విలాసవంతమైన జీవన శైలిని జీసస్ పేదరికం, పాదుపరితనంతో పోల్చి తేడా చూపిస్తాడు.

''ద పోప్ అండ్ ద విచ్'' లో పోప్ ఒక పత్రికా సమావేశంలో గర్భస్రావ హక్కులకై ఊరేగింపు తీస్తున్న బాలలను గందర గోళానికి గురిచేస్తాడు. ''ఆక్సిడెంటల్ డెత్ ఆఫ్ ఏన్ అనార్కిస్ట్'' ఫో నాటకాల్లో అత్యంత ప్రసిద్ధమైనది. ఇది 7వ దశకంలో జరిగిన వాస్తవ సంఘటనలో ఒక అరాచక వాది నిర్బంధించబడతాడు. పోలీసు విచారణలో ఉన్న ఇతను ప్రమాదవశాత్తు నాల్గవ అంతస్తునుండి కిందకు పడి అశువులు బాసినట్లు పోలీసులు ప్రకటిస్తారు. అయితే హామ్లెట్‌లా ఉన్మాదిగా కన్పించే ఒకపాత్ర స్టేషనంతా కలియ తిరుగుతూ, అందర్నీ అనుకరిస్తూ పోలీసులు పరస్పర విరుద్ధమైన వివరణలనిచ్చే స్థితికి గురిచేసి ఈ బాంబు దాడికి బాధ్యులు అరాచక వాదులు కారని, అధికారులతో కుమ్మక్కైన పోలీసులే ఇందుకు బాధ్యులని తేలుస్తాడు. నాటకమంతా ఒక ఉద్రిక్త వాతావరణం ఆవరించి ఉంటుంది. పోలీసుల అమానుషచర్యలకు గురైన ఒక అమాయకుడి మృత్యువును చుట్టుముట్టిన హాస్య, విషాద సంఘటనలనుండి ఈ ఉద్రిక్తత ఏర్పడుతుంది. ఇందులో కన్పించే ఉన్మాది పాత్ర - నిజజీవితంలో వాస్తవాన్ని బయటపెట్టేందుకు ఎవరూ సాహసించనిదాన్ని బహిర్గతం చేసేందుకు ఒక ఆయుధం. ''ట్రంపెట్స్ అండ్ రాస్బెరీస్'' ఫో రాసిన మరొక గొప్ప నాటకం. ఫో తన సతీమణితో కలసి రాసిన నాటకాల్లో ఫెమినిస్ట్ దృక్పథం కన్పిస్తుంది. ఓపెన్ కపుల్, ఎ ఉమన్ ఎలోన్ అండ్ మోనోలాగ్స్, ఇట్సాల్ బెడ్- బోర్డ్ అండ్ చర్చ్, ఆర్క్ ఏంజల్స్, డోన్ట్‌ప్లే పిన్‌బాల్, ఆల్ మోస్ట్ బై ఛాన్స్ ఎ ఉమన్, ఎలిజబెత్, ద డెవిల్ విత్ బూబ్స్, అడల్ట్ ఆర్గాజమో ఎస్కేప్స్ ఫ్రంద జూ మున్నగునవి ఈ కోవకు చెందుతాయి. ఈ నాడివి ప్రామాణిక ఫెమినిస్ట్ రచనలు.

ఫో మొదటిసారిగా U.S లో 1980 సం॥లో వి వోంట్ పే - వి వోంట్ పే అనే నాటకంతో విజయం సాధించాడు. ఇందులో ఆకాశాన్నంటే ధరలతో క్రోధం చెందిన కొందరు గృహిణులు స్థానిక సూపర్ మార్కెట్ ముందు ధర్నా చేస్తారు. అక్కడి మేనేజర్ వాళ్ళను నిర్లక్ష్యం చేయగా కొన్ని ఆహార పదార్థాలను తస్కరించి పారిపోతారు. తర్వాత కొందరు పారిశ్రామిక కార్మికులు కంపెనీ కఫెటేరియాలో ఆహారం బాగుండనందున ఉద్యోగం విడిచి బయటకు వస్తారు. ప్రయాణ ఛార్జీలు పెరగడంతో ఆవేశం చెందిన ప్రయాణీకులు రైళ్ళను అడ్డగిస్తారు. మిలన్ స్థంభిస్తుంది. ఇదంతా ఒక ఫామిలీ డ్రామాగా ప్రదర్శించబడుతుంది. ఆహార పదార్థాలను దొంగిలించడాన్ని సమర్థిస్తూ ఒక గృహిణి తన భర్తతో వాదనకు దిగుతుంది. కార్పోరేట్ అత్యాశకు ఇది సరైన ప్రతిస్పందనేనని ''దోపిడికి సరైన సమాధానం దురాక్రమణేనని'' అతను చివరకు అంగీకరిస్తాడు. హాస్య, అధిక్షేపాల మేళవింపుకు ఇది మంచి ఉదాహరణ.

ఫో నాటకాలు విప్లవాత్మకమైనవి. మానవత, ప్రజాస్వామ్య వాదాలను మేల్కొలిపి, అధికార పీఠానికి, అసమానతకు, అన్యాయానికి, అణచి వేతకు ప్రతీక అయిన 'చక్రవర్తికి' దుస్తుల్లేవనే నగ్న సత్యాన్ని చెప్పగలిగే ధైర్యాన్ని మనలో కల్గిస్తాయి. ఉద్దేశంలో సృజనశీలి కావాలంటే నిరంతర అసమ్మతి వాదిగా ఉండక తప్పదు. 'పోరాటం' అన్న పదం 'కార్యచరణ, నిర్భయంగా మాట్లాడటం' అన్నప్పుడే నిర్మాణాత్మకం, అర్థవంతం అవుతుంది.



**NO LITTERING PLEASE :** This crow picks up a smouldering cigarette butt thrown carelessly by smoker during the World Wildlife Week in Calcutta on Monday. — PTI

MISIMI/మిసిమి RNI Regd. No. 45042/90 Telugu Monthly, Hyderabad-500 020. Postal Regd. No. H/SD/191.



Gabriel Garcia Marquez

*"for his novels and short stories, in which the fantastic and the realistic are combined in a richly composed world of imagination, reflecting a continent's life and conflicts"*

*1982 Nobel Prize in Literature*